Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699


అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue) : 204 పేజీలు (Pages) : 8 వెల : రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

ఆదివారం, 22 - 3 - 2026

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com NI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం : 2015

# శ్రీవారి పాదసన్నిధిలో సీఎం చంద్రబాబు కుటుంబం

**- అన్నదానం ట్రస్టుకు రూ.44 లక్షల విరాళమిచ్చిన సీఎం కుటుంబం - ప్రతీ ఏడాది మనవడు దేవాన్ష్ పుట్టిన రోజున ఒక రోజు అన్నప్రసాదానికి విరాళం - సామాన్య భక్తునిలా వైకుంఠం క్యూ కాంప్లెక్స్ నుంచే శ్రీవారి దర్శనం చేసుకున్న సీఎం చంద్రబాబు - వెంగమాంబ అన్నదాన కాంప్లెక్సులో భక్తులకు అన్నప్రసాదాన్ని అందించిన సీఎం కుటుంబ సభ్యులు - భద్రతను పక్కన పెట్టి భక్తుల వద్దకు నేరుగా వెళ్లిన సీఎం చంద్రబాబు - తిరుమలలో సౌకర్యాలపై భక్తులను అడిగి తెలుసుకున్న ముఖ్యమంత్రి - లడ్డూలో నాణ్యత మెరుగైందని సీఎం చంద్రబాబుకు చెప్పిన భక్తులు**



**తిరుమల, (రాజధాని వార్తలు):** కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీ వేంకటేశ్వర స్వామిని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు శనివారం తన కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. తన మనవడు దేవాన్ష్ జన్మదినాన్ని పురస్కరించుకుని తిరుమల విచ్చేసిన సీఎం కుటుంబం, భక్తిశ్రద్ధలతో శ్రీవారిని కొలుచుకున్నారు.

ముఖ్యమంత్రి వెంట ఆయన సతీమణి భువనే శ్వరి, తనయుడు, మంత్రి నారా లోకేష్, మనవడు దేవాన్ష్ ఉన్నారు. దర్శనం అనంతరం టీటీడీ వేద పండితులు సీఎం కుటుం బానికి వేదాశీర్వచనమిచ్చారు. టీటీడీ ఈవో ముద్దాడ రవిచంద్ర శ్రీవారి ప్రసాదాన్ని అందజేశారు. దేవాన్ష్ పుట్టినరోజు సందర్భంగా సీఎం కుటుంబం ఒక రోజు అన్నదానానికి అయ్యే ఖర్చు రూ.44 లక్షలను అన్నదాన ట్రస్టుకు విరాళంగా అందజేశారు. దేవాన్ష్ పుట్టినప్పటి నుంచి ప్రతీ ఏడాది విరాళమిచ్చే సంప్రదాయాన్ని చంద్రబాబు కుటుంబం పాటిస్తోంది. దీంట్లో భాగంగా ఇప్పటివరకు 12 సార్లు విరాళమిచ్చారు. ముఖ్యమంత్రి హోదాలో మహాద్వారా ప్రవేశం ద్వారా నేరుగా ఆలయంలోకి వెళ్లే వెసులుబాటు ఉన్నప్పటికీ సామాన్య భక్తుని మాదిరిగానే వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారానే దర్శనం చేసుకున్నారు.

తొలిసారి సీఎం అయినప్పటి నుంచి వైకుంఠం క్యూ కాంప్లెక్స్ ద్వారానే శ్రీవారి దర్శనం చేసుకుంటున్న సీఎం... ఇప్పటికీ అదే ఆనవాయితీని పాటిస్తు న్నారు. ఎప్పటిలా సామాన్య భక్తుని మాదిరిగానే శ్రీవారి పట్ల తనకున్న భక్తిని చాటుకున్నారు. అన్న ప్రసాదం అందిస్తూ... భక్తుల సౌకర్యాలపై ఆరా తీస్తూ... శ్రీవారి దర్శనం అనంతరం ఆలయం నుంచి కాలినడకన తరిగొండ వెంగమాంబ అన్నదాన కాంప్లెక్స్‌కు వెళ్లిన సీఎం కుటుంబం, అక్కడ భక్తులకు స్వయంగా అన్నప్రసాదాన్ని వడ్డించారు. ఈ సందర్భంగా భక్తులతో ముచ్చటిస్తూ వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు.

తిరుమల మాడ వీధుల్లో ముఖ్యమంత్రి నడుచుకుంటూ వెళ్తున్న సమయంలో భక్తులు ఆయన్ను చూసి ఉత్సాహంగా పలకరించారు. సెక్యూరిటీ ప్రోటోకాల్స్ పక్కన పెట్టి మరీ భక్తుల వద్దకు వెళ్లిన సీఎం, వారితో కరచాలనం చేస్తూ ఫోటోలు దిగారు. ఓ భక్తురాలు తన వద్దనున్న కరుంగలి మాలను సీఎంకు బహుకరించారు. దానిని ముఖ్యమంత్రి అప్యాయంగా స్వీకరించారు. లడ్డూ ప్రసాదం నాణ్యతపై భక్తుల అభిప్రాయాలను సీఎం చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. లడ్డూ ప్రసాదం చాలా బాగుందని భక్తులు సంతృప్తి వ్యక్తం చేశారు. దర్శనం మరింత వేగంగా జరిగేలా చూడాలని భక్తులు కోరగా, ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. భక్తుల సౌకర్యార్థం ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ వ్యవస్థను ఇప్పటికే ఏర్పాటు చేశామని, త్వరలోనే ఏఐ టెక్నాలజీ ద్వారా శ్రీవారి దర్శనం మరింత సులభతరం, త్వరితగతిన జరిగేలా చర్యలు తీసుకుంటామని సీఎం హామీ ఇచ్చారు.

# భక్తుల నమ్మకాన్ని కాపాడాలి... నాణ్యమైన ప్రసాదాన్ని అందించాలి

**- దేశానికే ఆదర్శంగా నిలిచేలా తిరుమలలో ఫుడ్ సేఫ్టీ చర్యలు - భారతదేశంలో ఒక ఆలయం కోసం ఏర్పాటు చేసిన మొట్టమొదటి హై-టెక్ ల్యాబ్ - తిరుమలలో రూ.25 కోట్లతో అత్యాధునిక ఫుడ్ అనాలసిస్ ల్యాబ్ ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు - ఈ-టంగ్ - ఈ-నోస్ వంటి అధునాతన టెక్నాలజీతో రుచి, వాసన పరీక్షలు**






**తిరుమల, (రాజధాని వార్తలు):** భక్తుల నమ్మకానికి చిన్నపాటి విఘాతం కూడా కలిగించకూడదని.. వారి నమ్మకాన్ని కాపాడేలా నిరంతరం కృషి చేస్తూనే ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు టీటీడీ అధికారులను ఆదేశించారు. భక్తులకు నాణ్యమైన ప్రసాదాన్ని, తాగునీటిని అందించేందుకు టెక్నాలజీని వినియోగిస్తూ చిత్తశుద్ధితో పని చేయాలని సీఎం సూచించారు. కలియుగ వైకుంఠం తిరుమలకు వచ్చే కోట్లాది మంది భక్తుల నమ్మకం, విశ్వాసాలను మరింత పెంచేలా... ఆరోగ్య భద్రతే ధ్యేయంగా టీటీడీ మరో చారిత్రాత్మక అడుగు వేసింది. స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీ, FSSAI సంయుక్తంగా టీటీడీ సహకారంతో రూ.25 కోట్ల వ్యయంతో నిర్మించిన అత్యాధునిక వాటర్ - ఫుడ్ అనాలసిస్ ల్యాబ్‌ను సీఎం చంద్రబాబు శనివారం ప్రారంభించారు. దేశంలోనే ఒక ఆలయం కోసం ఏర్పాటు చేసిన మొట్ట మొదటి అత్యున్నత ప్రమాణాలు కలిగిన ల్యాబ్ ఇదే కావడం విశేషమని సీఎం చంద్రబాబు ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ల్యాబ్ ప్రారంభోత్సవం అనంతరం ముఖ్యమంత్రి ల్యాబ్ లోని ప్రతి విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించారు. ల్యాబ్ పనితీరు, సామర్థ్యం గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రసాదాల తయారీలో వాడే ముడి పదార్థాల నాణ్యతను ఏ స్థాయిలో విశ్లేషించవచ్చని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. 12 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో కెమికల్, మైక్రోబయాలజీ విభాగాలుగా దీనిని నిర్మించామని, ఇందులో e-tongue, e-nose వంటి అత్యాధునిక సౌకర్యాలు ఉన్నాయని అధికారులు తెలిపారు. ఇవి ఆహార పదార్థాల రుచి, వాసనను డిజిటల్ పద్ధతిలో ఖచ్చితంగా విశ్లేషించగలవని అధికారులు సీఎంకు వివరించారు. 1981లో నీటి పరీక్షల కోసం చిన్నదిగా ప్రారంభమైన ఈ విభాగం, ఇప్పుడు నెలకు 1,000 నుండి 1,500 శాంపిళ్లను విశ్లేషించే స్థాయికి చేరడం పట్ల సీఎం సంతృప్తి వ్యక్తం చేశారు.

**కల్తీ నివారణే లక్ష్యం : సీఎం ఆదేశాలు**

శ్రీవారి లడ్డూ ప్రసాదం తయారీలో వాడే నెయ్యి, ఇతర పదార్థాల కల్తీ నివారణకు తీసుకుంటున్న చర్యలపై ముఖ్యమంత్రి ప్రత్యేకంగా అడిగి తెలుసుకున్నారు. కల్తీ జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారని అధికారులను ప్రశ్నించారు. 2024 నవంబరులో చీణదీ సంస్థ విరాళంగా అందించిన ఆధునిక GC/HPLC యంత్రాల ద్వారా నెయ్యి స్వచ్ఛతను అత్యంత శాస్త్రీయంగా ఇక్కడే నిర్ధారించవచ్చని అధికారులు వెల్లడించారు. 2025 జూలై నుంచి నెయ్యి నాణ్యతపై విస్తృత స్థాయిలో పరీక్షలు నిర్వహిస్తున్నామని, దీనివల్ల కల్తీకి ఏమాత్రం అవకాశం ఉండదని ముఖ్యమంత్రికి అధికారులు వివరించారు. ముడి పదార్థాల్లో ఉండగలిగే పురుగు మందుల అవశేషాలు, యాంటీ బయోటిక్స్, లెడ్, ఆర్సినిక్ వంటి హెవీ మెటల్స్ కనుగొనే సామర్థ్యం ఉన్న పరికరాలను కూడా ఈ ల్యాబులో ఏర్పాటు చేసినట్లు అధికారులు వివరించారు.

**తిరుమలలో ల్యాబ్ దేశానికే ఆదర్శం**

బ్యాక్టీరియా గుర్తింపు కోసం ప్రత్యేకంగా క్లీన్ రూమ్, ఎయిర్ హ్యాండ్లింగ్ సిస్టమ్ వంటి భద్రతా ప్రమాణాలను చూసి ముఖ్యమంత్రి అభినందించారు.

శ్రీవారి ప్రసాదాల పట్ల భక్తులకు ఉన్న అపారమైన నమ్మకాన్ని కాపాడటమే తమ ప్రభుత్వ ప్రథమ కర్తవ్యంగా అధికారులు పని చేయాలని స్పష్టం చేశారు. కేవలం ల్యాబ్ పరీక్షలకే పరిమితం కాకుండా, అన్నప్రసాద కేంద్రాల్లోని వంటశాలల శుభ్రతపై నిరంతర తనిఖీలు నిర్వహించి పరిశుభ్రతను నిర్ధారించాలని ఆదేశించారు. టీటీడీ తీసుకున్న ఈ చర్యలు శ్రీవారి ప్రసాదాల పట్ల మరింత నమ్మకాన్ని, విశ్వాసాన్ని పెంచా లని ముఖ్యమంత్రి ఆకాంక్షించారు. భక్తుల ఆరోగ్య రక్షణకు మాత్రమే కాకుండా, తిరుమలలో చేపట్టిన ఫుడ్ సేఫ్టీ చర్యలు దేశానికే ఒక ఆదర్శంగా నిలుస్తాయని ముఖ్యమంత్రి కొనియా డారు. ఈ కార్యక్రమంలో మంత్రి సత్య కుమార్ యాదవ్, టీటీడీ పాలకమండలి సభ్యులు, ఉన్నతాధికారులు, ఫుడ్ - సేఫ్టీ ల్యాబ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేంద్రం కీలక నిర్ణయం.. కమర్షియల్ గ్యాస్ సరఫరా 20 శాతం పెంపు



**ఢిల్లీ :** కమర్షియల్ గ్యాస్ సిలిండర్ల కొరత నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు పలు రాష్ట్రాలకు కేంద్ర పెట్రోలియం సహజ వాయువుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి డాక్టర్ నీరజ్ మిట్టల్ లేఖ రాశారు. రాష్ట్రాలకు అదనంగా మరో 20శాతం కమర్షియల్ గ్యాస్ అందించనున్నట్లు ప్రకటించారు. ఈనెల 23వ తేదీ నుంచి అదనంగా 20 శాతం కమర్షియల్ గ్యాస్ సరఫరా చేయనున్నట్లు తెలిపారు. ఇటీవల 10 శాతం కమర్షియల్ గ్యాస్ సరఫరాను కేంద్రం పెంచిందని నీరజ్ మిట్టల్ స్పష్టం చేశారు. తాజాగా మరోసారి 20 శాతం పెంచుతూ కేంద్రం నిర్ణయం తీసుకుందని తెలిపారు. హోటల్స్, రెస్టారెంట్లు, దాబాలకు గ్యాస్ కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాలను సూచించారు. పారిశ్రామిక క్యాంటీన్లు, ఫుడ్ ప్రాసెసింగ్, పాడి పరిశ్రమ, రాష్ట్ర ప్రభుత్వాలు లేదా స్థానిక సంస్థలతో నడిపించే రాయితీ క్యాంటీన్లు, అవుట్‌లెట్లు, కమ్యూనిటీ కిచెన్‌లకు సరఫరా అయ్యేలా చూడాలని ఆయా రాష్ట్రాలకు నీరజ్ మిట్టల్ సూచించారు.

# గుడ్ న్యూస్.. ప్రభుత్వ ఉద్యోగుల పదవీ విరమణ వయసు ఎంతంటే.?

**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగులకు కూటమి సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. ప్రభుత్వ రంగ సంస్థలు, గురుకుల సొసైటీ పాఠశాలల ఉద్యోగుల పదవీ విరమణ వయసును సవరిస్తూ నిర్ణయం తీసుకుంది.

ఉద్యోగుల పదవీ విరమణ వయసు 60 నుంచి 62 సంవత్సరాలకు పెంచుతూ గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్ నిర్ణయం తీసుకున్నారు. దీనిపై శనివారం సమావేశమైన మంత్రులు నారా లోకేశ్, పయ్యావుల కేశవ్, నారాయణ సానుకూల నిర్ణయం తీసుకున్నారు. వయసు సడలింపు అంశాన్ని గత వైసీపీ ప్రభుత్వం నిరాకరించగా.. కూటమి ప్రభుత్వం మాత్రం సానుకూలంగా స్పందించింది. ప్రభుత్వ రంగ సంస్థలు, గురుకుల సొసైటీ పాఠశాలల ఉద్యోగుల పదవీ విరమణ వయసు పెంపుపై ఏపీ ఎన్జీఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ హర్షం వ్యక్తం చేశారు. ఉద్యోగులకు మేలు చేసే నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతించారు.

ఈ మేరకు గ్రూప్ ఆఫ్ మినిస్టర్స్, సీఎం చంద్రబాబు నాయుడుకు ధన్యవా దాలు తెలిపారు. మరోవైపు ఉద్యోగులు సైతం సంతోషం వ్యక్తం చేస్తున్నారు. తమకు మేలు చేసిన కూటమి ప్రభుత్వంపై ప్రశం సలు కురిపిస్తున్నారు. కాగా, దీనిపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

# ఏపీ పారిశ్రామిక రంగంలో గొప్ప ముందడుగు

**- ఫలితాలను ఇస్తోన్న 21 నెలల కూటమి ప్రభుత్వ ప్రయత్నాలు - అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా పరిశ్రమకు శంకుస్థాపన**
**- కేంద్రమంత్రులతో కలిసి ఈనెల 23న సీఎం చంద్రబాబు భూమిపూజ**
**- రూ.1,35,964 కోట్ల పెట్టుబడి - ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్ష మందికి ఉద్యోగావకాశాలు - ఏడాదికి 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల ఉక్కు ఉత్పత్తి సామర్థ్యం**

**అమరావతి, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక అభివృద్ధిలో మరో చారిత్రాత్మక అడుగు పడుతోంది. ఉక్కు ఉత్పత్తిలో అగ్రగామి సంస్థ ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ఇండియా (ఏఎంఎన్ఎస్ ఇండియా) సంస్థ 17.8 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో రాష్ట్రంలో గ్రీన్‌ఫీల్డ్ ఇంటిగ్రేటెడ్ స్టీల్ ప్లాంట్ నెలకొల్పడానికి సిద్ధమైంది. దీనికి ఈనెల 23న అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం రాజయ్యపేటలో కేంద్రమంత్రులతో కలిసి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు భూమిపూజ చేయనున్నారు. రూ.1,35,964 కోట్ల భారీ పెట్టుబడితో ఏర్పాటు కానున్న ఈ ప్రాజెక్ట్ ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్షమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. 5,465 ఎకరాల్లో మొత్తం రెండు దశల్లో ఈ ప్రాజెక్టు సాకారం కానుంది. మొదటి దశలో 7.3 మిలియన్ మెట్రిక్ టన్నులు, రెండో దశలో 10.5 మిలియన్ మెట్రిక్ టన్నుల సామర్థ్యంతో ఉక్కు ఉత్పత్తి చేయనుంది.

**క్యాప్టివ్ పోర్టుతో మరో 6 వేల ఉద్యోగాలు**

స్టీల్ ప్లాంట్‌కు అనుబంధంగా 50 మి.మె.ట సామర్థ్యంతో అదనంగా 316 ఎకరాల్లో క్యాప్టివ్ పోర్టును కూడా ఏఎంఎన్ఎస్ ఇండియా ఏర్పాటు చేయనుంది. దీని కోసం ప్రత్యేకంగా రూ.11,198 కోట్ల పెట్టుబడి పెట్టనుంది. దీంతో మరో 6,000 మందికి ఉద్యోగాలు రానున్నాయి. ఏఎంఎన్ఎస్ ఇండియా ప్లాంట్ ఏర్పాటుతో విశాఖ ఎకనమిక్ రీజియన్ పరిశ్రమల హబ్‌గా రూపుదిద్దుకోనుంది. గ్రీన్ ఫీల్డ్ స్టీల్ ప్లాంట్ ఏర్పాటు ద్వారా దేశంలో భారీగా పెరిగిన ఉక్కు మార్కెట్‌లో కీలక పాత్ర పోషించే అవకాశం ఏఎంఎన్ఎస్ ఇండియాకు లభించనుంది.

**అన్ని విధాలా రాష్ట్ర ప్రభుత్వ సహకారం**

ఈ ప్రాజెక్టు త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోంది. స్టీల్ ప్లాంట్‌ను ఎన్‌హెచ్-16తో కలిపేలా 4 లేన్ రహదారి విస్తరణ పనులు చేపట్టింది. కనెక్టివిటీ పెంచడంతో పాటు పరిశ్రమకు అవసరమయ్యే నీరు, విద్యుత్ వంటి మౌలిక వసతులు శరవేగంగా కల్పిస్తోంది.

**ముఖ్యమంత్రి పర్యటన వివరాలు**

సోమవారం జరిగే ఈ శంకుస్థాపన కార్యక్రమానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ప్రముఖులు, పారిశ్రామికవేత్తలు హాజరుకానున్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిధిగా హాజరవుతారు. అలాగే కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల మంత్రి హెచ్.డి.కుమారస్వామి, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్య మంత్రి పవన్ కల్యాణ్, ఆంధ్రప్రదేశ్ ఐటీ, మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేష్ ముఖ్య అతిధులుగా పాల్గొంటారు. ఇంకా ఏపీ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మంత్రులు అనిత, టి.జి. భరత్, ఎంపీ సి.ఎం. రమేష్ విశిష్ట అతిథులుగా హాజరవుతారు. ఆర్సెలార్ మిట్టల్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ లక్ష్మీ మిట్టల్, ఏఎంఎన్ఎస్ ఇండియా చైర్మన్ ఆదిత్య మిట్టల్ భూమి పూజలో పాల్గొంటారు. సోమవారం మధ్యాహ్నం ముఖ్య మంత్రి చంద్రబాబు అమరావతి నుంచి నేరుగా నక్కపల్లి మండలం రాజయ్యపేటకు హెలికాప్టర్ ద్వారా చేరుకుంటారు. మధ్యాహ్నం 3.40 గంటలకు ఎక్స్‌పీరియన్స్ జోన్ సందర్శించి, ఏఎంఎన్ఎస్ ఇండియా స్టీల్ ప్లాంట్ మోడల్‌ను పరిశీలిస్తారు. అనంతరం కేంద్ర మంత్రులతో కలిసి శంకుస్థాపన ఫలకం ఆవిష్కరిస్తారు. అలాగే అవగాహన ఒప్పందాల కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం అమరావతికి తిరుగు ప్రయాణమవుతారు.

# 20 లక్షల ఉద్యోగాల కల్పనే ప్రభుత్వ లక్ష్యం : మంత్రి నారాయణ

**- ప్రజల చెంతకు పాలన..సంతపేట వీధుల్లో సామాన్యుడిలా మంత్రి సందడి - సంతపేట మార్కెట్ పునరుద్ధరణతో వ్యాపారుల హర్షం - 15 కీలక ప్రాంతాల్లో డ్రైనేజీ, సిమెంట్ రోడ్ల పనులు ముమ్మరం - ముస్లిం సోదరులతో మంత్రి ఆత్మీయ భేటీ..గొల్లవీధిలో పండగ ఉత్సాహం**










**నెల్లూరు, (రాజధాని వార్తలు):** ఇచ్చిన మాట ప్రకారం జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన ప్రభుత్వం తమదని రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ పేర్కొన్నారు. రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా అడుగులు వేస్తున్నామన్నారు. పరిశ్రమలు నెలకొల్పి లక్ష్యాన్ని చేరుకొనేందుకు సీఎం చంద్రబాబు, యువనేత లోకేష్ అలుపెరగని కృషిచేస్తున్నారన్నారు. శుక్రవారం నెల్లూరు నగరంలో మంత్రి నారాయణ సుడిగాలి పర్యటన చేసారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యానికి గురైన సంతపేట మార్కెట్‌ను యుద్ధప్రతిపాదికన పునరుద్ధరిస్తూ, వ్యాపారుల కోరిక మేరకు ప్రతి షాపుకు మెట్లు, మౌలిక వసతులు కల్పించి మహర్దశ పట్టించారు. నెల్లూరు షుగర్ ఫ్యాక్టరీ స్థానంలో కొత్త పరిశ్రమల స్థాపన, నెలాఖరుకల్లా MSME క్లస్టర్ పూర్తి, మరియు 10,060 పోస్టులతో కొత్త జాబ్ క్యాలెండర్ విడుదల ద్వారా స్థానిక యువతకు భారీగా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని భరోసా ఇచ్చారు. సంతపేట సచివాలయంలో అధికారులతో రివ్యూ నిర్వహించి సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయిలోనే ఆదేశాలు జారీ చేసారు . గొల్లవీధిలోని ముస్లిం సోదరుల ఇళ్లకు నేరుగా వెళ్లి చిన్నారులతో ముచ్చటిస్తూ, పెద్దలకు రంజాన్ శుభాకాంక్షలు తెలుపుతూ 'సామాన్యుడి'గా ప్రజలతో మమేకమయ్యారు. ఎన్నికల హామీల కంటే రెట్టింపు స్థాయిలో పొగతోట సహా 15 కీలక ప్రాంతాల్లో డ్రైనేజీ, సిమెంట్ రోడ్ల పనులను ముమ్మరం చేస్తూ నెల్లూరును ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో కమీషనర్ నందన్, మేయర్ సుజాతా అశోక్, డిప్యూటీ మేయర్ రూప్ కుమార్ యాదవ్, రాష్ట్ర వేర్ హౌస్ కార్పొరేషన్ డైరెక్టర్ కపిర శ్రీనివాసులు, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ తాళ్ళపాక అనూరాధ, మాజీ జెడ్పిటీసి విజేతా రెడ్డి, టీడీపీ మహిళా నేత కపిర రేవతి, కార్పొరేషన్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# యేమినేనికి ఉగాది పురస్కారం - ఏపీఎంపీఏ నాయకుల హర్షం



**విజయవాడ, (రాజధాని వార్తలు):** ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యేమినేని వెంకటరమణ జర్నలిజంలో నిబద్ధతతో పనిచేస్తూ తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించారని, ఆయనకు లభించిన "ఉత్తమ జర్నలిస్టు" అవార్డు మీడియా రంగానికి గర్వకారణమని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వీర్ల శ్రీరామ్ యాదవ్ అన్నారు. నగరంలోని ఆంధ్రప్రదేశ్ మీడియా ప్రొఫెషనల్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యాలయంలో నగర అధ్యక్షుడు అనిల్ కుమార్ తాళ్లూరి ఆధ్వర్యంలో శనివారం పలువురు జర్నలిస్టులు ఆయనను దుస్సాలువతో సన్మానించారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత ఏపీఎంపీఏ రాష్ట్ర ఉపాధ్యక్షుడు యేమినేని వెంకటరమణ మాట్లాడుతూ, జర్నలిజంలో నిజాయితీ, బాధ్యతాయుత దృక్పథం ఎంతో ముఖ్యమని, ఈ అవార్డు తనకు మరింత బాధ్యతను గుర్తు చేస్తుందని తెలిపారు. భవిష్యత్తులో కూడా సమాజానికి ఉపయోగపడే వార్తలు అందించేందుకు కృషి చేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంపీఏ రాష్ట్ర కార్యదర్శి పసుపులేటి చైతన్య, నగర కార్యదర్శి గుర్రం శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు వేల్పుల ప్రశాంత్, కోటా రాజా, దావులూరు దయాకర్, ఎం.శ్రీనివాసరావు, ప్రభాకర్, మల్లి, తదితరులు పాల్గొన్నారు.

# బాల్యం బందిఖాన కాకూడదు




**నెల్లూరు, (రాజధాని వార్తలు):** గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ ఆద్వర్యంలో శుక్రవారం తాడేపల్లి మండలం మెల్లెంపూడి గ్రామంలో ఏర్పాటు చేసిన బాలలు భవిష్యత్ నిర్మాణానికి పునాదులు అనే నినాదంతో బాలల హక్కుల గురించి శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేయటం జరిగింది.ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ నుండి సిస్టర్ నీరజ మాట్లాడుతూ బాల్యం అనేది కుటుంబం, బంధువులు స్నేహితులతో సంబంధాలను ఏర్పరచుకుంటూ, భవిష్యత్తు జీవితానికి అవసరమైన పునాదులను వేసుకునే మంచి సమయం అని సాధారణంగా 1-2 సంవత్సరాల నుండి 12-13 సంవత్సరాల వరకు,అంటే కౌమారదశ వచ్చే వరకు ఉన్న కాలాన్ని బాల్యం అంటారని ఈ దశలో ఆటపాటల ద్వారా, నేర్చుకోవడం సామాజిక నైపుణ్యాలను పెంపొందించుకునే తరుణం అని శారీరక పెరుగుదల ఎత్తు, బరువు వేగంగా పెరగడం మరియు శారీరక సామర్థ్యాలు మెరుగుపడడం జరుగుతుందని మానసిక వికాసం ఆలోచన, జ్ఞాపకశక్తి, భాషా నైపుణ్యాలు మరియు వ్యక్తిత్వం ఈ దశలోనే బలపడతాయి. ఎటువంటి బాధ్యతలు, చింతలు లేకుండా ఆనందంగా, స్వేచ్ఛగా గడిపే అమాయకత్వపు రోజులు అవి వీరికి ఉన్న 4 ప్రాథమిక హక్కులు వారు పొందుకొనేందుకు, వత్తిడి లేని విద్యనభ్యసించటానికి తల్లిదండ్రులు,ఉపాధ్యాయులు పెద్దలు,సమాజం సహకరించాలి అని తెలిపారు. అనంతరం సిబ్బంది అత్తోట పోతురాజు మాట్లాడుతూ బాలల పార్లమెంట్ ద్వారా పిల్లలకు సమాజం గురించి పిల్లలు ఎదుర్కొనే సమస్యలు వాటిని అధికమించే మార్గాల గురించి తర్ఫీదు ఇస్తున్నాం అని దీనివల్ల నేటి బాలలుగా ఉన్న వీరు రేపటి పౌరులుగా ఎదుగుతారు అని పిల్లల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉచిత హెల్ప్ లైన్ నంబర్స్ 1098,100 112ల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 35 మంది బాలబాలికలు, భగత్ సింగ్ బాలల పార్లమెంట్ సభ్యులు గుడ్ షెఫర్డ్ స్వచ్ఛంధ సంస్థ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పేకాట స్థావరంపై ఆకస్మిక దాడి చేసిన ఇందుకూరుపేట పోలీసులు - "పేకాట రాయళ్లు పారా హుషార్"

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** జిల్లాలో దొంగ చాటుగా జరిగే పేకాటలు నివారించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని జిల్లా యస్.పి. డా.అజిత వేజెండ్ల అదేశాలు మేరకు, ప్రత్యేక బృందం ద్వారా ఇందుకూరుపేట పిఎస్ పరిదిలోని ఇందుకూరుపేట గ్రామ పంట పొలాలలో 20.03.2026 తేదిన పేకాట స్తావరంపై దాడి చేసారు. పక్కా సమాచారం మరియు పగడ్బందిగా ఈ దాడిని నిర్వహించి నలుగురు జూదరులు అదుపులోనికి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 12,000ని మరియు 3 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఇందుకూరుపేట పిఎస్ పరిధిలో మట్కా, గాంబ్లింగ్, కోడిపందేలు వంటి అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోడతాయని తెలిపారు. ఈ రైడ్‌లో ఎస్ఐ కె.నాగార్జున రెడ్డి, స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు. ఎవరైనా కోడిపందేలు లేదా ఇతర అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు




చేస్తున్నట్టు సమాచారం తెలిసిన పక్షంలో వెంటనే డయల్ 112 ద్వారా పోలీసులకు సమాచారం ఇవ్వాలి. సమాచారం అందించిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచబడతాయి" అని స్పష్టం చేశారు.



# ఈ నెల 24న శ్రీ శృంగార వల్లభ స్వామి హుండీల లెక్కింపు

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం మండలం, తొలి తిరుపతి గ్రామంలో వేంచేసియున్న శ్రీ శృంగార వల్లభ స్వామి దేవస్థానం నందు ఈ నెల 24వ తేది ఉదయం 9 గంటలకు దేవస్థానం మరియు రెవెన్యూ, పోలీస్ డిపార్ట్మెంట్, గ్రామస్థులు, ధర్మకర్త మండలి సమక్షంలో దేవదాయ, ధర్మాదాయ అధికారుల పర్య వేక్షణలో హుండీల లెక్కింపు కార్యక్రమం నిర్వహించబడునని దేవస్థాన కార్యనిర్వాహణాధికారి వడ్డి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో భాగంగా తెలిపారు.

# జిల్లా కలెక్టర్‌కి జర్నలిస్టుల ఆత్మీయ సత్కారం

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** తెలుగువారి తొలి పండుగ ఉగాది సందర్భంగా విశాఖ జిల్లా కలెక్టర్ ఎం ఎన్. హరేంధిర ప్రసాద్‌ను లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్ (ఎల్ ఎన్ ఏ) ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. నగరంలోని సిరిపురంలో గల వీఎమ్ఆర్డిఏ చిల్డ్రన్స్ ఏరినాలో గురువారం జరిగిన ఉగాది ప్రత్యేక కార్యక్రమంలో ఆయనను కలిసి దుశ్శాలువా కప్పి పూల బొకే అందజేశారు. ఆయనకు ఉగాది శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల మిత్రులందరికీ కలెక్టర్ ఉగాది పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. ఏ శుభవేళ అందరికీ మేలు జరగాలని ఆకాంక్షించారు. విశాఖ జిల్లా కలెక్టర్‌గా ఆయన బాధ్యతలు స్వీకరించిన నాటినుండి జర్నలిస్టులకు అన్ని విధాలా సహకారం అందజేస్తున్నారు. అక్రిడేటెడ్ జర్నలిస్టులకు పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో 50% స్కూలు ఫీజు రాయితీ, వర్కింగ్ జర్నలిస్ట్ హెల్త్ స్కీమ్ (డబ్ల్యూజేహెచ్ఎస్) కింద జర్నలిస్టులు చెల్లించాల్సిన ప్రీమియంను సిఎస్ఆర్ నిధుల నుండి చెల్లించి ఎంతో తోడ్పాటునిచ్చారు. జర్నలిస్టులకు ఉచితంగా ప్రైవేటు సంస్థలలో వైద్య పరీక్షలు నిర్వహించి సహకరించారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ సేవలను జర్నలిస్టు సంఘాల ప్రతినిధులు కొనియాడారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు సూరంపూడి వీరభద్రరావు, లోకల్ న్యూస్ పేపర్స్ అసోసియేషన్(ఎల్ఎన్ఏ) అధ్యక్షుడు పి .సత్యనారాయణ, అసోసియేషన్ ఆఫ్ స్మాల్ అండ్ మీడియం న్యూస్ పేపర్స్ ఫర్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొల్లి కమల్ కుమార్, ఎల్ ఎన్ఏ ప్రతినిధులు కొయిలాడ పరశురాం, బొంతు నారాయణరావు, ఎన్.ఎస్.ఆర్ గుప్త, ఎం.శ్రీహరి, పృధ్వీరాజు, సూర్య ప్రకాష్, ఎస్.ఎన్.నాయుడు, బోని ఆదిరాజు తదితరులు పాల్గొన్నారు.

# గాయత్రి గ్యాస్ ఏజెన్సీ తనిఖీ చేసిన ఆర్డీఓ

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం పట్టణంలో గల గాయత్రి గ్యాస్ ఏజెన్సీని శుక్రవారం పెద్దాపురం ఆర్డీఓ ఎన్.శ్రీధర్ తహశీల్దార్ సిహెచ్.వెంకటలక్ష్మీతో కలసి తనిఖీ చేశారు. దీనిలో భాగంగా ఆర్డీఓ రికార్డులు పరిశీలించి గ్యాస్ బుకింగ్, డెలివరి విధానం, స్టాక్ గౌడౌన్, రికార్డుల నిర్వహణ వంటివి తనిఖీ చేసి యజమాన్యానికి సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యాస్ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా గ్యాస్ సరఫరా చేయాలని సూచించారు. ఆయన వెంట వీఆర్వోలు, తదితరులు ఉన్నారు.



# జిల్లాలో డిమాండ్‌కు సరిపడా గ్యాస్ సరఫరా

## - అవసరం మేరకు మాత్రమే బుకింగ్ చేసుకోవాలి - గ్యాస్ పొదుపుగా వాడుకోవాలి : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి





**విజయనగరం, (రాజధాని వార్తలు):** జిల్లాలో గృహ వినియోగ గ్యాస్‌కు కొరత లేదని, డిమాండ్‌కు సరిపడా సరఫరా జరుగుతుందని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు ఆందోళన చెందవద్దని డిమాండ్ సరిపడా గ్యాస్ నిల్వలు అందుబాటులో ఉన్నాయన్నారు. గ్యాస్ పొదుపుగా వాడుకోవాలని సూచించారు. ప్రజలు అవసరం మేరకు మాత్రమే గ్యాస్ కొనుగోలు చేయాలని, ఆందోళన చెంది అనవసరంగా బుకింగ్ చేయవద్దని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి వారి ఆదేశాలు డిమాండ్, సప్లయిలో అంతరాన్ని తగ్గించుటకు తగు ప్రణాళిక సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి సివిల్ సప్లయ్ అధికారులను అదేశించారు. గ్యాస్ డిమాండ్ నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు కూడా చేపట్టాలని తెలిపారు. జిల్లాలో మొత్తం గ్యాస్ కనెక్షన్‌ల సంఖ్య, బుకింగ్, ప్రస్తుతం స్టాక్, డిమాండ్ సప్లై అంతరశీ, సాధారణ డిమాండ్ వంటి వివరాలతో నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో సీ పి ఒ, డి ఎస్ ఒ పాల్గొన్నారు.

# నిరుద్యోగులకు ఉపాధి కల్పన ముఖ్యమంత్రి చంద్రబాబుతోనే సాధ్యం

## - ఎన్నికల హామీ మేరకు జాబ్ క్యాలెండర్ విడుదల : గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్



**గూడూరు, (రాజధాని వార్తలు):** రాష్ట్రంలో నిరుద్యోగ యువ తకు ఉపాధి కల్పించడం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతోనే సాధ్యమని, ఎన్నికలకు ముందు నారా లోకేష్ నిర్వహించిన యువ గళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు జాబ్ క్యాలెండర్ ను ఉగాది పండుగను పురస్కరించుకొని ప్రభుత్వం విడుదల చేసిందని రాష్ట్రంలో నిరుద్యోగులు అందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రానికి అనేక పరిశ్రమలు తీసుకు వస్తున్నారని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ వెల్లడించారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావే శంలో ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ ఉగాది పండుగ సందర్భంగా ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ విడుదల చేసిందని ఎన్నికలకు ముందు యువగళం పాదయాత్రలో మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారని ఇచ్చిన హామీని నెరవేర్చడం జరిగిందని గుర్తు చేశారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉగాది సందర్భంగా సందర్భంగా కూటమి ప్రభుత్వం ఇచ్చిన కానుక జాబ్ క్యాలెండర్ అని తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడులు రావాలన్నా ఉద్యోగాల కల్పన జరగాలన్న అది ఒక ముఖ్యమంత్రి చంద్రబాబు తన సాధ్యమని తెలిపారు. దేశ విదేశాల్లో పర్యటిస్తూ పెద్ద ఎత్తున రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకొస్తూ పరిశ్రమలను రాష్ట్రానికి తీసుకువచ్చి రాష్ట్రంలోని నిరుద్యోగులు అందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి ఎంతో కృషి చేస్తున్నారని వెల్లడించారు. 20 నెలల్లో కూటమి ప్రభుత్వం ఆరు లక్షల 28 నెల 347 ఉద్యో గాలను యువతకు అందించడం జరిగిందన్నారు పిడతోపాటు 23 లక్షల కోట్ల పెట్టుబడుతూ 25 ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా వివిధ కంపెనీలతో ఒప్పందాలు జరిగాయి అన్నారు కూటమి ప్రభు త్వం అధికారులు వచ్చిన వెంటనే తొలి సంతకంగా ఉత్సామీర్లో భాగంగా మెగా డీఎస్సీను ప్రకటించి టీచర్ పోస్టులను భర్తీ చేసిం దన్నారు. పదివేల ఉద్యోగాలు కల్పించే విధంగా జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి నిరుద్యోగ యువతకు అవకాశం కల్పించారు అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ నెరవేరుస్తూ వస్తుందని పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు గుర్తుంచుకోవాలని సూచించారు ఈ సమావేశంలో తిరుపతి పార్లమెంటు జిల్లా అధికార ప్రతినిధి అబ్దుల్ రహీం, గూడూరు పట్టణ రూరల్ మండలం పార్టీ అధ్యక్షులు శ్రీనివాసులు, వెంకటేశ్వరరాజు, డీవీఎంసీ సభ్యులు ఏసుపాక పెంచలయ్య, శివకుమార్, వైయస్సార్ జనసేన నాయకులు చంద్ర నిల్, టిడిపి మహిళా నాయకులు గుండాల భారతి, సునీల్, తదితరులు పాల్గొన్నారు.

# అభిమానుల నడుమ ఘనంగా రవి రాఘవేంద్ర జన్మదిన వేడుకలు





**గూడూరు, (రాజధాని వార్తలు):** ఆల్ ఇండియా ఎస్సీ, ఎస్టీ బీసీ, జాతీయ మైనారిటీ యునైటెడ్ ఫోరం అధ్యక్షులు దేగ రవి రాఘవేంద్ర జన్మదిన వేడుకలను అభిమానుల మధ్య ఘనంగా నిర్వహించారు. శుక్రవారం గూడూరు పట్టణంలోని అరుంధతి పాలెంలో ఆల్ ఇండియా ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీ యునైటెడ్ ఫోరం జాతి అధ్యక్షులు దేగ రవి రాఘవేంద్ర పుట్టినరోజు వేడుకలు ఘనంగా నిర్వహించారు. దేగ రవి రాఘవేంద్రకు స్థానికులు ఘన స్వాగతం పలికారు రవి రాఘవేంద్ర కేక్ కట్ చేసి అందరికీ అందించారు.

పలువురు అభిమానులు ప్రజాసంఘాల నాయకులు ఆయన్ని ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. అనం తరం రవి రాఘవేంద్ర మాట్లాడుతూ పేద ప్రజలకు ఏ సమస్య వచ్చినా అండగా ఉంటామని నాపై ఎంతో అభిమానంతో పుట్టిన రోజు వేడుకలు ఘనంగా నిర్వహించడం సంతోషంగా ఉందని అన్నారు. పిల్లలను బాగా చదివించాలని వారికి ఏదైనా అవసర మైతే మా వంతు సహకారం అందిస్తామని వెల్లడించారు. జన్మదిన వేడుకలను ఇంత ఘనంగా నిర్వహించిన ఫోరమ్ సభ్యులు, మహిళలు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు. జన్మదిన వేడుకల్లో వివిధ జిల్లాల నుండి హాజరైన ఫోరమ్ రాష్ట్ర నాయకులకు, జిల్లా నాయకులకు పేరు పేరున రవి రాఘవేంద్ర కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఫోరం జాతీయ ఉపాధ్యక్షులు విజయ్ అంబేద్కర్, సీమాంధ్ర ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు పందిటి సుబ్బయ్య, తెలుగుదేశం పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి మాతంగి కృష్ణ, యునైటెడ్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు కుడుముల సుబ్బారావు, డిఆర్పిఎస్ జిల్లా అధ్యక్షులు ప్రభుదాస్, ఎంఈఎఫ్ నాయకులు తోళ్ల నారాయణ, చింతకుంట మస్తానయ్య, పార్థసారథి, గుంటూరు దయాసాగర్, యునైటెడ్ ఫోరం విద్యార్థి విభాగం అధ్యక్షులు ఉద్దాల మణి, అయ్యప్ప, మురళి, లతా నాయక్, దేవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# సాలూరు ప్రజల దశాబ్దాల కల సాకారం

## - 100 పడకల ఆధునిక ఆసుపత్రిని ప్రారంభించిన మంత్రి గుమ్మిడి సంధ్యారాణి





**సాలూరు, (రాజధాని వార్తలు):** సాలూరు నియోజకవర్గ ప్రజల చిరకాల వాంఛ, దశాబ్దాల కల నెరవేరింది. అత్యుత్తమ వైద్య సేవలను స్థానికులకు అందుబాటులోకి తీసుకువస్తూ, సుమారు రూ. 17 కోట్ల వ్యయంతో నిర్మించిన 100 పడకల అత్యాధునిక ప్రభుత్వ ఆసుపత్రిని రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రివర్యులు శ్రీమతి గుమ్మిడి సంధ్యారాణి శుక్రవారం అత్యంత ఘనంగా ప్రారంభించి, ప్రజలకు అంకితం చేశారు. 2019లో ఎమ్మెల్సీగా ఈ ఆసుపత్రి భవనానికి భూమి పూజ చేసి, నేడు కూటమి ప్రభుత్వంలో మంత్రిగా అదే ఆసుపత్రిని ప్రారంభించడం గర్వంగా ఉందన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఆసుపత్రి పనుల పూర్తికి అదనంగా మరో కోటి రూపాయలను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. గిరిజన ప్రాంతాలకు సంజీవని లాంటిదని అన్నారు. గతంలో కేవలం 30 పడకలకే పరిమితమైన పాత ఆసుపత్రి వల్ల రోగులు తీవ్ర ఇబ్బందులు పడేవారని, అత్యవసర పరిస్థితుల్లో 60 కిలోమీటర్ల దూరంలోని విజయనగరం లేదా 120 కిలోమీటర్ల దూరంలోని విశాఖపట్నం వెళ్లాల్సి వచ్చేదని గుర్తుచేశారు. సకాలంలో వైద్యం అందక ఒక్కోసారి ప్రాణాపాయ స్థితి వచ్చేదని అన్నారు. ఈ ఆసుపత్రి ద్వారా సాలూరుతో పాటు పాచిపెంట, మక్కువ, రామభద్రపురం మండలాల్లోని సుమారు లక్ష మంది గిరిజన ప్రజలకు మెరుగైన వైద్యం అందుతుందని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. ఒడిశా సరిహద్దు ప్రాంత వాసులకు కూడా ఇది అత్యవసర సేవల కేంద్రంగా మారనుందని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చొరవతో, అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు అండగా నిలుస్తూ సుమారు రూ. 2 కోట్ల విలువైన సిఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెండింగ్‌లో ఉన్న పనులను పరుగులు పెట్టించి, యుద్ధ ప్రాతిపదికన ఈ ఆసుపత్రిని సిద్ధం చేశామని ఆమె పేర్కొన్నారు. జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలు ఇప్పటికీ అనారోగ్యం వస్తే నాటు వైద్యం లేదా సంప్రదాయ చికిత్సల వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. అటువంటివి మాని, ప్రభుత్వ ఆసుపత్రులలో అందుబాటులో ఉన్న మెరుగైన వైద్య సేవలను వినియోగించుకోవాలన్నారు.

మన ప్రాంతంలో ఏరియా ఆసుపత్రితో పాటు సుమారు 10 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు మరియు ప్రతి సచి వాలయ పరిధిలో హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్లు అందుబాటులో ఉన్నాయని గుర్తుచేశారు. వైద్యులు ప్రతి నెలా గ్రామాలకు వచ్చి తనిఖీలు చేస్తున్నారని, కాబట్టి దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండానే వైద్యం పొందవచ్చన్నారు. గిరిజన ప్రాం తాల నుండి వచ్చే రోగులకు కేవలం మందులు ఇచ్చి పంపడం కాకుండా, వ్యాధి రావడానికి గల మూల కారణాన్ని గుర్తించి చికిత్స అందించాలన్నారు. రోగులతో కనీసం రెండు మూడు నిమిషాలు మాట్లాడి, వారి ఆహారపు అలవాట్లు, జీవనశైలిని తెలుసుకోవడం ద్వారా వారికి మరింత మెరుగైన సేవలు అందిం చవచ్చని సూచించారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ మౌలిక సదు పాయాలు ప్రజలకు పూర్తి స్థాయిలో చేరినప్పుడే ప్రభుత్వ ఆశయం నెరవేరుతుందన్నారు.

**హర్షం వ్యక్తం చేస్తున్న స్థానికులు**

ఆధునిక సౌకర్యాలు, నిపుణులైన వైద్యులతో అందుబాటులోకి వచ్చిన ఈ ఆసుపత్రి సాలూరు నియోజకవర్గ ఆరోగ్య రంగంలో ఒక మైలురాయిగా నిలవనుంది. "మా ప్రాంతానికి ఇది ఎంతో అవసరమైన సదుపాయం" అంటూ స్థానిక ప్రజలు, గిరిజనులు మంత్రి కృషిని కొనియాడుతూ హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆసుపత్రుల సమన్వయ అధికారి డా. జి.నాగభూషణ రావు, ఇతర వైద్యాధికారులు, ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శ్రీశ్రీ కోట దుర్గమ్మ అమ్మవారి ఆలయ ద్వితీయ వార్షికోత్సవం






**మక్కువ, (రాజధాని వార్తలు):** మక్కువ గ్రామంలో కొలువైయున్న శ్రీ శ్రీ కోట దుర్గమ్మ ఆలయ ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలలో మక్కువ మండల వైయస్సార్సీపి జడ్పిటిసి పార్వతీపురం నియోజకవర్గ వైఎస్ఆర్సిపి పరిశీలకులు మావుడి శ్రీనివాసరావు మక్కువ మండల వైయస్సార్సీపి అధ్యక్షులు మావుడి రంగు నాయుడు, యువ నాయకులు మావుడి తిరుపతిరావు పాల్గొని కోట దుర్గ అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం సుమారు 2000 మంది భక్తులకు ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులకు అసౌకర్యం కలుగ కుండా ఆలయ కమిటీ సభ్యులు మరియు వైఎస్ఆర్సిపి యువత అధిక సంఖ్యలో పాల్గొని ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# సాలూరు మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా జె.సీ

## - ఘనంగా స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలిపిన అధికారులు, సిబ్బంది



**సాలూరు, (రాజధాని వార్తలు):** సాలూరు మున్సిపాలిటీ ప్రత్యేక అధికారిగా జిల్లా జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు మున్సిపాలిటీ పాలకవర్గ గడువు ముగియడంతో, తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు ఆయన ఈ బాధ్యతల్లో కొనసాగనున్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మున్సిపల్ కార్యాలయ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పట్టణ అభివృద్ధికి, ప్రజలకు మెరుగైన సేవలందించడానికి ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు. ముఖ్యంగా పట్టణంలో పారిశుధ్య నిర్వహణను మెరుగుపరచడం మరియు చెత్త సేకరణను క్రమబద్ధీకరించడం జరుగుతుందని అన్నారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని పట్టణ ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చూస్తామని అన్నారు. పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ మరియు రోడ్ల పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించి, పారదర్శకమైన పాలన అందించడం. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులు మరియు ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# సంపాదకీయం

## ఉన్నత విద్యా ప్రమాణాలు సమున్నతమయ్యేనా?

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఫిబ్రవరి 27న జారీ చేసిన జీవో రాష్ట్ర ఉన్నత విద్యా వ్యవస్థలో చర్చకు తెర తీస్తున్నది. ఇప్పటివరకు విడివిడిగా పనిచేస్తున్న కమిషనరేట్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్, కమిషనరేట్ ఆఫ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ వ్యవస్థలను ఏకీకృతం చేసి కమిషనరేట్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అనే ఒకే నోడల్ సంస్థ ఏర్పాటు ఈ ఉత్తర్వుల లక్ష్యం. ఈ నిర్ణయాన్ని కేవలం పరిపాలనా మార్పుగా కాకుండా, రెండు దశాబ్దాలుగా ఉన్నత విద్య ఎదుర్కొంటున్న సమస్యలు, అలాగే ప్రభుత్వం తన ఉత్తర్వుల్లో స్వయంగా చెప్పుకున్న కారణాల నేపథ్యంలో చూడాలి. ఈ ఉత్తర్వుల్లో ప్రభుత్వం మొదటగా ప్రస్తావించింది విజన్ 'స్వర్ణాంధ్ర @2047'. ఈ డాక్యుమెంట్ ప్రకారం రాష్ట్రాన్ని దీర్ఘకాలంలో జ్ఞాన ఆధారిత ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలంటే మానవ వనరుల నాణ్యతను వేగంగా మెరుగుపరచాల్సిన అవసరం ఉందని పేర్కొంది. ప్రభుత్వం చెప్పిన మరో కారణం- ఉన్నత విద్య పరిపాలన చిన్న చిన్న విభాగాలుగా ఉండటం, విభిన్న సంస్థల మధ్య అధికారాల అతివ్యాప్తి, ఇందువల్ల ఏర్పడిన బాధ్యతాయుత నాయకత్వ లోపం. ఈ పరిస్థితి వల్ల నిర్ణయాలు ఆలస్యమై, విద్యా సంవత్సరం గందరగోళానికి లోనవడం వంటి సమస్యలు తలెత్తుతున్నాయని అంగీకరించింది. ఇంకొక అంశం- ఇప్పటివరకు డిగ్రీ కాలేజీలు ఒక కమిషనరేట్ ఆధీనంలో, ప్రైవేట్ కాలేజీలు మరో నియంత్రణలో, టెక్నికల్ ఎడ్యుకేషన్ మరో విభాగం ఆధీనంలో ఉండటం వల్ల ఒకే విధమైన అకడమిక్ ప్రమాణాల అమలు సాధ్యం కావడం లేదు. అలాగే, టెక్నికల్ ఎడ్యుకేషన్ విషయంలో ఫైళ్ళు రెండు మూడు విభాగాల మధ్య తిరగడం వల్ల నో--అబ్జెక్షన్ సర్టిఫికెట్లు, ఫీజు నిర్ధారణ, అనుబంధ ప్రక్రియలు ఆలస్యం కావడం. ఇవన్నీ కలిపి చూస్తే, ఈ ఉత్తర్వులు యాదృచ్ఛికంగా కాకుండా, ఉన్నత విద్య పాలనలోని వాస్తవ లోపాలకు ప్రతిస్పందనగా తెచ్చినవి. విశ్వవిద్యాలయాలు నిజంగా జ్ఞానసృష్టి కేంద్రాలుగా మారాలంటే వాటికి అకడమిక్, పరిపాలన, ఆర్థిక అంశాల్లో స్వయంప్రతిపత్తి అవసరం అని జాతీయ విద్యా విధానం-2020 (ఎన్ఈపీ) చెబుతోంది. విశ్వవిద్యాలయాల విషయంలో ఎటువంటి రాజకీయ జోక్యం ఉండకూడదు. పాలకమండలిలో కూడా విద్యా ప్రమాణాలు సాధించడంలో ప్రత్యేక అనుభవం ఉన్న అధ్యాపకులను, విద్యారంగ నిపుణులను, మేధావులను నియమించాలి. నియంత్రణ అవసరమే కానీ హద్దుల్లో ఉండాలి. పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్థాయి విద్య, పరిశోధన, కొత్త ఆలోచనలు ఇవన్నీ స్వేచ్ఛాయుత విద్యా వాతావరణం లేకుండా ఎదగలేవు. ఈ కారణంగానే విశ్వవిద్యాలయాలను కేవలం బోధనా సంస్థలుగా కాకుండా, స్వతంత్ర ఆలోచనా కేంద్రాలుగా పెద్దలు భావించారు. అందువల్లనే, విశ్వవిద్యాలయాలకు స్వయంప్రతిపత్తిని కల్పించారు. అక్కడక్కడా చెదురుమదురుగా జరుగుతున్న కొన్ని అసందర్భమైన విషయాలను చూసి మొత్తం విశ్వవిద్యాలయాలన్నింటినీ ఒకే గాటన కట్టకూడదు. ఈ ఉత్తర్వుల్లో విశ్వవిద్యాలయాల స్వయంప్రతిపత్తి పూర్తిగా రద్దు అవుతుందని ప్రభుత్వం ఎక్కడా చెప్పలేదు. కానీ పరిపాలనా ఏకీకరణ, ఒకే నోడల్ వ్యవస్థ, ఫైల్ రూటింగ్ పెరగడం వంటి పరిణామాలు ఆచరణలో స్వయంప్రతిపత్తిని పూర్తిగా కాగితాలకే పరిమితం చేసే ప్రమాదముంది. ఇలా జరిగితే, పోస్ట్ గ్రాడ్యుయేషన్ స్థాయిలో కొత్త కోర్సుల రూపకల్పన, అంతరశాఖా కార్యక్రమాలు ప్రారంభించడం, పరిశోధనా ప్రాజెక్టులకు వేగంగా అనుమతులు ఇవ్వడం వంటి అంశాలు నెమ్మదించే ప్రమాదం కూడా ఉంది. దేశవ్యాప్తంగా ఉన్నత విద్య ప్రమాణాలపై ఆందోళనలు ఉన్నాయి. దీనిని కాగ్ నివేదికలు, పార్లమెంటరీ కమిటీ వ్యాఖ్యలు, నాణ్యతా భరోసా సంస్థల మార్గదర్శకాలు కూడా సూచిస్తున్నాయి. ఇక్కడ ప్రశ్న ఏమిటంటే చిన్నచిన్న లోపాలు దొర్లినందుకు మొత్తం వ్యవస్థను బలహీనపరచడం సరైన మార్గమా? విధానపరంగా ఇది సమానుపాతం అనే సూత్రానికి విరుద్ధం. ఇప్పటి సంస్కరణల చర్చలో మరో కీలకమైన అంశం మానవీయ శాస్త్రాలు, భాషా సాహిత్యాల స్థానం. ఎన్ఈపీ స్వయంగా చెబుతున్న విషయం-భారతీయ భాషలు, సాహిత్యం, తత్వశాస్త్రం, కళలు ఒక జాతి సాంస్కృతిక మేధస్సుకు మూలాధారం. కేవలం సాంకేతికత, ఉద్యోగావకాశాలనే ప్రధానంగా చూసి మానవీయ శాస్త్రాలను నిర్లక్ష్యం చేస్తే, సంస్కృతీ వైముఖ్యం, నైతిక పతనం, సామాజిక విభేదాలు దీర్ఘకాలంలో పెరుగుతాయి. అందుకే విశ్వవిద్యాలయాలలో ముఖ్యంగా డిగ్రీ స్థాయిలో, భాషా, సాహిత్యాల కోర్సులను ఆధునిక అవసరాలకు అనుగుణంగా అనువాద అధ్యయనాలు, సాంస్కృతిక పరిశ్రమలు, మీడియా, వారసత్వ అధ్యయనాలు వంటి అంతరశాఖా రూపాల్లో పునర్నిర్మించాల్సిన అవసరం ఉంది. ఇది విద్యార్థుల నమోదు పెరగడానికి సహాయపడుతుంది. ఈ ఉత్తర్వులలో మంచి ఉద్దేశాలు ఉన్నాయి. పరిపాలనా గందరగోళాన్ని తగ్గించడం, సమన్వయం పెంచడం, డేటా ఆధారిత పాలనకు దారి చూపడం వంటివి. అదే సమయంలో ప్రమాదాలూ ఉన్నాయి. విశ్వవిద్యాలయాలు కేవలం అమలు కేంద్రాలుగా మారే అవకాశం, స్నాతకోత్తర స్థాయి కోర్సులు, పరిశోధనలు పరోక్షంగా దెబ్బతినే ప్రమాదం, మానవీయ శాస్త్రాలు పూర్తిగా కనుమరుగయ్యే ప్రమాదం వంటివి. కాబట్టి, ఈ సందర్భంలో ఈ ఉత్తర్వుల అవసరం ఉన్నది కానీ పైన చెప్పిన విషయాలన్నింటినీ సమన్వయం చేసుకుంటూ సమతుల్యమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసుకోవాలి. జఃజు తన పాత్రను సమన్వయకర్తగా పరిమితం చేయాలి, నెమ్మదిగా విద్యాత్మక నియంత్రత్వానికి దారి తీయకూడదు. విశ్వవిద్యాలయాల కోసం స్పష్టమైన "స్వయం ప్రతిపత్తి చార్టర్" ప్రకటించాలి. స్నాతకోత్తర స్థాయి కోర్సులు, పరిశోధనలపై కనీస జోక్యం, గరిష్ఠ రక్షణ విధానం ఉండాలి. మానవీయ శాస్త్రాలు, భాషా సాహిత్యాలకు ప్రత్యేక ప్రోత్సాహక విధానాలు రూపొందించాలి. అక్రమాలకు లక్షిత పరిష్కారాలు ఇవ్వాలి. వ్యవస్థ మొత్తాన్ని బలహీనపరచకూడదు.

# తెలుగువారి కీర్తి ప్రతిష్టలకు మైలురాయి శోభన్ బాబు

### - ఘనంగా 18వ వర్ధంతి వేడుకలు - సిటీ వైడ్ శోభన్ బాబు ఫ్యాన్స్ ఆధ్వర్యంలో విస్తృత సేవా కార్యక్రమాలు నిర్వహణ



**విశాఖ: డాబాగార్డెన్స్, (రాజధాని వార్తలు):** ఆంధ్రుల అందగాడిగా అభిమానుల గుండెల్లో సుస్థిర స్థానం సంపాదించిన సినీ నటుడు శోభన్ బాబు తెలుగువారి కీర్తి ప్రతిష్టలకు మైలురాయిగా నిలిచారని ప్రజాపిత బ్రహ్మకుమారి బికే. రామేశ్వరి, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టులు ఫెడరేషన్ నాయకులు గంట్ల శ్రీనుబాబులు కొనియాడారు. డాబాగార్డెన్స్ వైజాగ్ జర్నలిస్టుల ఫోరం ప్రెస్ క్లబ్ ఎదురుగా ఉన్న శోభన్ బాబు కాంస్య విగ్రహం వద్ద గురువారం 18వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. సిటీ వైడ్ శోభన్ బాబు ఫ్యాన్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకల్లో వీరు మాట్లాడుతూ భౌతికంగా శోభన్ బాబు ప్రజల మధ్య లేకపోయినప్పటికీ లక్షలాదిమంది అభిమానుల మనసుల్లో చోటు దక్కించుకున్నారన్నారు. అలాగే తెలుగు రాష్ట్రాల్లో శోభన్ బాబు ఫ్యాన్స్ చేస్తున్న సేవా కార్యక్రమాలు ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఎప్పటికీ శోభన్ బాబు అందరివాడుగా నిలిచిపోవాలని వీరు ఆకాంక్షించారు. శోభన్ బాబు ఫ్యాన్స్ అధ్యక్షులు కోడూరు కనకరాజు మాట్లాడుతూ శోభన్ బాబు జయంతి వర్ధంతి కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు నగరంలో పలు ప్రాంతాల్లో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. తమకు సహకరించిన వారందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. అలాగే శోభన్ బాబు ఫ్యాన్స్ అంతా కూడా ఐకమత్యంగా ముందుకు సాగుతున్నామని ఒకరు కష్టనష్టాల్లో మరొకరు ఆదుకుంటున్నామన్నారు.

**విగ్రహానికి పూలమాలలు.. ఘన నివాళులు.. సేవా కార్యక్రమాలు**

తొలుత శోభన్ బాబు కాంస్యవిగ్రహానికి అతిథులు అభిమానులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది. అనంతరం పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. పొంగలి ప్రసాదం, మజ్జిగతో పాటు వివిధ వృద్ధుల అనాథఆశ్రమాల్లో అన్న సమారాధన గావించారు. పలువురు పారిశుధ్య కార్మికులకు నిత్యవసర వస్తువులు అందజేశారు. ఈ కార్యక్రమంలో శోభన్ బాబు ఫ్యాన్స్ అధ్యక్షులు కోడూరు కనకరాజు, దసపల్ల ప్రసాద్, మువ్వల పోలరావు, త్రినాథ్, ఈశ్వర రావు, శోభనబాబు రమణ, ముందడగు మల్లేష్ పెద్ద ఎత్తున అభిమానులు పాల్గొన్నారు.

# ముగిసిన షర్మిలమ్మ ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర

### - రాజన్న రాజ్యం కోసం ప్రజల ఎదురుచూపు..ఏపీసీసీ స్పోర్ట్స్ సెల్ చైర్మన్ కమలాకర్



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల రెడ్డి గత నెల 2వ తేదీన ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన రాష్ట్ర వ్యాప్త 'ఉపాధి హామీ పరిరక్షణ యాత్ర' ఈ నెల 18న విజయవంతంగా ముగిసింది. ఈ యాత్రలో కీలక భూమిక పోషించిన ఏపీసీసీ స్పోర్ట్స్ సెల్ చైర్మన్ కమలాకర్, డాబాగార్డెన్స్ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో యాత్ర విశేషాలను వెల్లడించారు. ఈ యాత్ర మొత్తం 32 రోజుల పాటు నిరాటంకంగా సాగిందన్నారు. సుమారు 9 వేల కిలోమీటర్ల మేర ప్రయాణించి, రాష్ట్రవ్యాప్తంగా 48 గ్రామాలను షర్మిల రెడ్డి సందర్శించారని చెప్పారు. క్షేత్రస్థాయిలో రైతులు, రైతు కూలీలు మరియు సామాన్య ప్రజల కష్టాలను షర్మిల స్వయంగా అడిగి తెలుసుకున్నారన్నారు. యాత్రలో ఎదురైన సమస్యలపై షర్మిల రెడ్డి స్పందించిన తీరును కమలాకర్ కొనియాడారు. గ్రామాల్లోని సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి, అక్కడికక్కడే పరిష్కరించేలా చర్యలు చేపట్టారని చెప్పారు. ప్రజలు ఎదుర్కొంటున్న తాగునీటి ఎద్దడిపై ప్రత్యేకంగా స్పందించి, ఆ సమస్యలను పరిష్కరించడం ద్వారా ప్రజల నుంచి విశేష ఆదరణ పొందారని పేర్కొన్నారు. ఇది పార్టీ శ్రేణులకు ఎంతో స్ఫూర్తినిచ్చిందని ఆయన తెలిపారు. రాష్ట్రంలో మళ్ళీ రాజన్న రాజ్యం రావాలంటే షర్మిలమ్మ ముఖ్యమంత్రి కావాలన్నది ప్రజల బలీయమైన ఆకాంక్షగా కమలాకర్ పేర్కొన్నారు. అది త్వరలోనే నెరవేరుతుందన్న నమ్మకం కాంగ్రెస్ శ్రేణులందరికి ఉందని తెలిపారు. ఈ మీడియా సమావేశంలో కమలాకర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ దక్షిణ నియోజకవర్గ సమన్వయకర్త సూర్యనారాయణ, సీనియర్ నాయకులు ఉమ్మడి భాస్కర్ రావు, కస్తూరి వెంకట్రావు, స్పోర్ట్స్ సెల్ రంగనాయకులు పాత్రుడు, గణేష్, రాజేష్ ఇతర పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

# జివిఎంసి టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 4 వినతులు : జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకరరావు



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** మహా విశాఖపట్నం నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమంలో 4 వినతులు వచ్చాయని జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభా కరరావు తెలిపారు. శుక్రవారం జీవీఎంసీ ప్రధాన కార్యాలయం లోని సమావేశ మంత్రంలో డీసీపీలు రామ్మోహన్ రావు, వెంకటేశ్వరరావు, మధుసూధన రావులతో ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా చీఫ్ సిటీ ప్లానరు మాట్లాడుతూ జీవీఎంసీలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్ కార్యక్రమంలో జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి అధికంగా ఫిర్యాదులు నమోదవుతున్నందున, జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి ఫిర్యాదులు/ వినతులను స్వీకరించినందుకు గానూ ప్రత్యేకంగా ప్రతి శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ కార్యక్రమానికి సంబంధించి 4 వినతులను డీసీపీలు ప్రజల నుండి స్వీకరించడం జరిగినదని, అందులో భీమిలి జోనుకు 02, పెందుర్తి జోనుకు 01, గాజువాక జోనుకు 01 వినతులు వచ్చాయని తెలిపారు. స్వీకరించిన వినతులను /ఫిర్యాదులను నిర్ణీత సమయంలో టౌన్ ప్లానింగు అధికారులు వెంటనే స్పందించి పరిష్కరించాలని ఆదేశించడమైనదన్నారు. పట్టణ ప్రణాళికా విభాగమునకు సంబంధించి ఫిర్యాదులు, అర్జీలు మొదలైనవి ప్రతి శుక్రవారం టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరం కార్యక్రమంలో ప్రజలు నమోదు చేసుకోవచ్చునని తెలిపారు.


# అత్యంత ఘనంగా శ్రీ సీతారాముల కళ్యాణ ఉడుపురాట మహోత్సవం



**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** మధురవాడ టైలర్స్ కాలనీలో వేంచేసి ఉన్న శ్రీ విజయ దుర్గా దేవి అమ్మవారి ఆలయ ఆవరణలో ఈనెల మార్చ్ 27 శుక్రవారం శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని శ్రీ సీతారాముల దివ్య కళ్యాణ మహోత్సవం ఆలయ ధర్మకర్త బంగారు లక్ష్మి ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు పర్యవేక్షణలో వేద పండితులచే నిర్వహించడం జరుగుతుందని ఇందులో భాగంగా ఈరోజు నరసింగరావు మరియు నళిని దంపతులచే విఘ్నేశ్వర పూజ పుణ్యాహవాచనం రక్షా సూత్రధారణ మరియు ఉడుకురాట మహోత్సవం కార్యక్రమాన్ని ఆలయ అర్చకులు శ్రీకాంత్ శర్మ నిర్వహించడం జరిగిందని ఆలయ ధర్మకర్త బంగారు లక్ష్మి తెలిపారు ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మండలి సభ్యులు బంగారు ప్రకాష్ టెంటు మాధవి, భరణ్, కౌషిక్, కార్తికేయ, ధనలక్ష్మి పసుపులేటి గోపి, పాపారావు, కోలనీ వాసులు అధిక సంఖ్యలో అమ్మ వారి భక్తులు పాల్గొని తరించారు.

# గృహ వినియోగదారులకు ఇబ్బందులు లేకుండా గ్యాస్ సరఫరా చేయాలి

### - శ్రీ రాజేశ్వరి గ్యాస్ ఏజెన్సీలను ఆకస్మిక తనిఖీ చేసిన జెసి నిశాంతి



**అమలాపురం, (రాజధాని వార్తలు):** ఎల్‌పిజి వంట గ్యాస్ కొరత నేపధ్యంలో గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులు ప్రభుత్వ ఆదేశాలను తప్ప పాటిస్తూ గృహ నియోగదారులకు గ్యాస్ సరఫరాలో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా గ్యాస్ సరఫరా చేయాలని గ్యాస్ డీలర్లను జిల్లా జాయింట్ కలెక్టర్ టి నిశాంతి ఆదేశించారు. శ్రీ రాజేశ్వరి హెచ్.పీ గ్యాస్ డిస్ట్రిబ్యూటరీని శుక్రవారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏజెన్సీలోని స్టాక్ రికార్డులను, డెలివరీ రికార్డులను పరిశీలించి డీలర్లకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. పట్టణాల్లో 25 రోజులు గ్రామాలలో 30 రోజులు కాలవ్యవధి లలో సిలిండర్లు పానిక్ కృత్రిమ కొరతకు ఆస్కారం లేకుండా సరఫరా చేయాలని ఆదేశించారు. బుకింగ్ ప్రక్రియకు అనుగుణంగా మాత్రమే గృహ వినియోగదారులకు గ్యాస్ సరఫరా చేపట్టాలన్నారు. అంతర్జాతీయంగా ఇరాన్– ఇజ్రాయెల్ యుద్ధ వాతావరణం నెలకొన్న నేపథ్యంలో జిల్లాలో ఎల్పిజి వంట గ్యాస్ కొరత ఏర్పడకుండా ముందస్తు చర్యలు చేపట్టామని ఆ ప్రకారమే గ్యాస్ ఏజెన్సీలు సక్రమంగా గ్యాస్ సరఫరా చేయాలని జెసిడీలర్లను ఆదేశించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గృహ వినియోగదారులకు గ్యాస్ డెలివరీలో ఆలస్యం జరగకూడదన్నదే ప్రభుత్వ సంకల్పమన్నారు. అక్రమ నిల్వలు, గ్యాస్ కొరత ఉందనే సాకుతో ఎవరైనా కృత్రిమ కొరత సృష్టించినా లేదా బ్లాక్ మార్కెట్‌కు తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పారదర్శకతతో బుకింగ్ చేసుకున్న వినియోగదారులకు ప్రాధాన్యత క్రమంలో సిలిండర్లను పంపిణీ చేయాలన్నారు. పంపిణీ ప్రక్రియపై పౌరసరఫరాల అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. గ్యాస్ లభ్యతపై వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తగినంత నిల్వలు ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని ఆమె స్పష్టం చేశారు. వాణిజ్య వినియోగానికి గృహ సిలిండర్లను మళ్లించడం పూర్తిగా నిషేధమన్నారు. ఈ కార్యక్రమంలో సహాయ పౌరసరఫరాల అధికారి శరత్, తాసిల్దార్ వి.ఎస్.దివాకర్ సిఎస్డిటి భారతి, తూనికలు కొలతలు కంట్రోలింగ్ అధికారి రామయ్య తదితరులు పాల్గొన్నారు.

# బాలికలను రక్షిద్దాం.. బాలికలను చదివిద్దాం

### - బోడసకుర్రులో బేటి బచావో..బేటి పడావో కార్యక్రమం



**అల్లవరం, (రాజధాని వార్తలు):** బాలికల పట్ల వివక్ష తగదని అది ఒక సామాజిక రుగ్మతని బాలికలను రక్షిద్దాం.. బాలికలను చదివిద్దామని సర్పంచ్ రొక్కాల విజయలక్ష్మి అన్నారు. అల్లవరం మండలం బోడసకుర్రులో శుక్రవారం భేటీ బచావో భేటీ పడావో బుర్రకథ కార్యక్రమం నిర్వహించారు. బాలల హక్కులు, చట్టాలు, లింగ నిర్ధారణ, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని బాలికల పట్ల వివక్ష ఒక సామాజిక రుగ్మత అని ఆమె అన్నారు. బాలికల పట్ల వివక్ష కారణంగా చదువును నిలిపివేయటం, బాలికల ఆరోగ్యం, హక్కులను తీవ్రంగా దెబ్బతీ స్తాయని వివరించారు. ఈ కార్యక్రమంలో అరవ చంటి, దొమ్మేటి రాధాకృష్ణ, మొయిల గణపతి, అయిల శంకరం, ఇంచార్జ్ పంచాయితీ కార్యదర్శి చిట్టిబాబు, ఫీల్డ్ అసిస్టెంట్ శ్యామ్, సచివాలయ, హెల్త్ సిబ్బంది, అంగన్వాడీ టీచర్లు, పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

# శ్రీ దుర్గేశ్వర స్వామి వారికి విరాళంగా ఇత్తడి పానుమట్టం : నాగాభరణం



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తీశ్వర స్వామి వారి దేవస్థానంకు అనుబంధ దేవాలయం అయిన కనకాచల కొండ కింద వెలసిన శ్రీ దుర్గేశ్వర స్వామి వారికి శ్రీకాళహస్తికి చెందిన కె.భాస్కర్ రెడ్డి దంపతులు 8 కేజీల ఇత్తడి పానుమట్టం, నాగాభరణమును విరాళంగా ఆలయ కార్యనిర్వాహణాధికారి బీకే వెంకటేశులుకి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి బీకే వెంకటేశులు, డిఈఓ కృష్ణారెడ్డి, ఉపాలయాల పర్యవేక్షకులు రవి, గుమస్తా లక్ష్మయ్య, అర్చకులు చెంగల్ రాయులు పాల్గొన్నారు.

## ట్రెండీ లుక్‌తో అదరగొట్టిన అనన్య నాగళ్ళ.. సోషల్ మీడియాలో వైరల్



టాలీవుడ్ చందమామ అనన్య నాగళ్ల ఇప్పుడు సోషల్ మీడియాను షేక్ చేస్తోంది. 'మల్లేశం' సినిమాలో పద్ధతైన పల్లెటూరి అమ్మాయిగా మెప్పించిన ఈ బ్యూటీ, ఇప్పుడు రూటు మార్చింది. తన గ్లామర్ డోస్ పెంచుతూ నెట్టింట సెగలు రేపుతోంది. తాజాగా అనన్య తన ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన హాట్ ఫోటోలు చూసి ఫ్యాన్స్ ఫిదా అవుతున్నారు. కుర్రకారు గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తున్న ఈ తెలుగమ్మాయి లేటెస్ట్ గ్లామర్ హంగామా ఏంటో ఇప్పుడు చూద్దాం.

నెట్టింట సెగలు రేపుతున్న అనన్య గ్లామర్: అనన్య నాగళ్ల తన తాజా ఫోటో షూట్‌తో ఇంటర్నెట్‌ను ఊపేస్తోంది. ఈసారి ఆమె ఎంచుకున్న ట్రెండీ డ్రెస్ చూస్తే ఎవరైనా సరే వావ్ అనాల్సిందే. ఈ డ్రెస్ షార్ట్ వేసి, అదిరి పోయే పోజులిచ్చింది. గతంలో చీరకట్టులో మెరిసిన ఈ భామ, ఇప్పుడు మోడ్రన్ లుక్‌లో తనలోని హాట్ యాంగిల్‌ను బయట పెట్టింది. ఈ ఫోటోలు చూస్తుంటే అనన్య గ్లామర్ రేసులో స్పీడ్ పెంచిందని అర్థమవుతోంది. ఆమె షేర్ చేసిన కొద్దిసేప టికే ఈ పిక్స్ సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

హోమ్లీ లుక్ నుండి హాట్ లుక్ వరకు: సాధారణంగా తెలుగు హీరోయిన్లు అంటే కేవలం పద్ధతిగా ఉంటారనే ముద్ర ఉంటుంది.

కానీ అనన్య దాన్ని చెరిపేస్తోంది. 'మల్లేశం', 'వకీల్ సాబ్' వంటి సినిమాల్లో నటనకు ప్రాధాన్యమున్న పాత్రలు చేసిన ఈ అమ్మడు, ఇప్పుడు కమర్షియల్ సినిమాల్లో గ్లామర్ రోల్స్ కోసం సిద్ధంగా ఉన్నానని చెప్పకనే చెబుతోంది. తన సహజమైన అందం, ఆకట్టుకునే నవ్వుకి ఈ గ్లామర్ టచ్ తోడవ్వడంతో ఆమె ఫాలోయింగ్ అమాంతం పెరిగిపో యింది. నెటిజన్లు కూడా "మా తెలుగమ్మాయి మజాకా!" అంటూ కామెంట్లతో ముంచెత్తుతున్నారు.

ఫ్యాన్స్‌ని ఫిదా చేస్తున్న పోజులు: అనన్య తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో నిత్యం యాక్టివ్‌గా ఉంటూ తన పర్సనల్ మరియు ప్రొఫెషనల్ అప్‌డేట్స్‌ని షేర్ చేస్తూ ఉంటుంది. తాజా ఫోటో షూట్‌లో ఆమె ఇచ్చిన స్టిల్స్ ఫ్యాన్స్‌ని పిచ్చెక్కిస్తున్నాయి. ఆ కళ్లు, ఆ స్టైలిష్ లుక్స్ చూసి నెటిజన్లు హార్ట్ ఎమోజీలతో ఇన్బాక్స్ నింపేస్తున్నారు. కేవలం గ్లామర్ మాత్రమే కాదు, తన బాడీ లాంగ్వేజ్‌లో ఉన్న కాన్ఫిడెన్స్ ఆమెను మిగిలిన హీరోయిన్ల కంటే భిన్నంగా చూపిస్తోంది. అందుకే అనన్య ఫోటోలు పెడితే చాలు నిమిషాల్లో వేల సంఖ్యలో లైకులు వచ్చి చేరుతున్నాయి.

టాలీవుడ్‌లో కొత్త అవకాశాల కోసం..: అనన్య చేస్తున్న ఈ గ్లామర్ షో వెనుక ఒక స్పష్టమైన వ్యూహం ఉన్నట్లు కనిపిస్తోంది. టాలీవుడ్‌లో గ్లామర్ హీరోయిన్ల కొరత ఉన్న సమయంలో, తను అన్ని రకాల పాత్రలకు సూట్ అవుతానని మేకర్స్‌కి హింట్ ఇస్తోంది. ఇక ప్రస్తుతం ఆమె చేతిలో కొన్ని ఇంట్రెస్టింగ్ ప్రాజెక్టులు ఉన్నాయి. నటనతో పాటు ఈ రేంజ్ గ్లామర్ కూడా తోడైతే, అనన్య టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా ఎదగడం పెద్ద కష్టమేమీ కాదు. ఈ స్పీడ్ చూస్తుంటే త్వరలోనే పెద్ద సినిమాల్లో అనన్యను చూసే అవకాశం ఉందని సినీ విశ్లేషకులు భావిస్తున్నారు.

## ధురంధర్ అవన్నింటినీ బ్రేక్ చేసింది: ఆర్జీవి



ధురంధర్..ఇప్పుడు ఏ సెలబ్రిటీని, ఏ సగటు ప్రేక్షకుడిని కదిలించినా వినిపిస్తున్న ఒకే ఒక్క మాట ధురంధర్. ఆదిత్యధర్ అత్యంత సాహసోపేతంగా రూపొందించిన ఈ సినిమా ప్రపంచ వ్యాప్తంగా రికార్డులు సృష్టిస్తూ బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాన్ని సొంతం చేసుకుంది. సైలెంట్‌గా విడుదలై ఊహించని విధంగా బాక్సాఫీస్ వద్ద ర్యాపేజ్ చేసింది. రూ.1300 కోట్లకు మించి వసూళ్లని రాబట్టి ట్రేడ్ వర్గాలతో పాటు ఫిల్మ్ మేకర్స్‌ని విస్మయానికి గురి చేసింది. ఇంతటి సంచలన మూవీ తరువాత దీనికి సీక్వెల్‌గా విడుదలైన మూవీ ధురంధర్ ది రివేంజ్. మార్చి 19న అత్యంత భారీ స్థాయిలో పాన్ ఇండియా మూవీగా రిలీజ్ అయిన ఈ సినిమా బాక్సాఫీస్ వద్ద కలెక్షన్‌ల సునామీని సృష్టిస్తోంది. రూ.240 కోట్లు రాబట్టి అందరిని ఆశ్చర్యానికి గురి చేస్తోంది. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమాపై సినీ లవర్స్, సెలబ్రిటీలు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. దక్షిణాదికి చెందిన ప్రముఖ స్టార్లు ధురంధర్ 2పై సోషల్ మీడియా వేదికగా ప్రశంసిస్తున్నారు. సినిమా రిలీజ్‌కు ముందు నుంచి దర్శకుడు ఆదిత్యధర్‌కు హార్డ్ కోర్ ఫ్యాన్‌గా మారిపోయిన రామ్ గోపాల్ వర్మ ఈ సినిమాపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ధురంధర్‌పై సోషల్ మీడియా వేదికగా ఓ పుస్తకం సైజు ట్వీట్‌తో స్పందించిన వర్మ ..ఆదిత్యధర్‌ని ఆకాశానికి ఎత్తేస్తూ పొగడ్తల వర్షం కురిపించారు. తాజాగా ధురంధర్ ది రివేంజ్ రిలీజ్ అయిన నేపథ్యంలో దర్శకుడు ఆదిత్యధర్‌తో పాటు సినిమాపై షాకింగ్ కామెంట్స్ చేయడం ఆసక్తిని రేకెత్తిస్తోంది. ఓ జాతీయ మీడియాలో మాట్లాడుతూ నేటి తరం దర్శకుల్లో ఆదిత్యధర్ ది ప్రత్యేక శైలి. ధురంధర్ చూసిన తరువాత నాకు ఇదే అనిపించింది. ఆ తరువాత మోహిత్ సూరి సయారా కూడా చాలా కొత్తగా ఉంది. నేను చాలా ఎంజాయ్ చేశాను అన్నారు. ధురంధర్ గురించి మాట్లాడుతూ–ఇది కేవలం సినిమా మాత్రమే కాదు. ఇది సినిమా గ్రామర్‌ని, ప్రేక్షకుల ఆలోచనా విధానాన్ని మార్చేసింది. దీనిని ఓ ప్రమాణికంగా, బెంచ్ మార్క్‌గా తీసుకుని కొత్త తరం దర్శకులు సినిమాలు చేస్తారు. మీరు చేసినట్టుగా శివ, సత్యలని చూసి మేకర్స్‌గా మారతా రంటారా? అని అడిగిన ఓ ప్రశ్నకు సమాధానం చెబుతూ సత్యని గాడ్ ఫాదర్, గుడ్ ఫెల్లస్‌ల నుంచి స్ఫూర్తి పొంది రూపొందించాను. ఈ విషయాన్ని నేను ఎప్పుడో చెప్పాను. అలాగే ప్రతీ ఒక్కరూ ఎక్కడో అక్కడ ఇన్స్పైర్ అయి చేస్తుం టారు. అది ఫిల్మ్ మేకింగ్‌లో ఓ భాగం. సత్య చేసే టైమ్‌లో దీన్ని ఎంత కమర్షియల్‌గా తీయాలి..ఎంత వరకు పుష్ చేయాలనే దాన్ని ఆలోచించి తీశాను. క్యారెక్టర్ డైనమిజమ్, ఆర్టిస్ట్‌ల నటన, మిగతా వాటికి పదిరెట్లు ఉండేలా చూసుకు న్నాను. ఆ ఫార్ములా స్క్రీన్‌పై వర్కవుట్ అయ్యింది. సినిమా బ్లాక్ బస్టర్ హిట్ అయింది. అంటూ సత్య నాటి పరిస్థితుల గురించి చెప్పుకుంటూ వచ్చారు.


## చంపేస్తామని బెదిరిస్తున్నారు.. కుంభమేళా మోనాలిసా ఫిర్యాదు



మహాకుంభమేళాలో రుద్రాక్షలు విక్రయిస్తూ సోషల్ మీడియా ద్వారా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన మోనాలిసా భోంస్లే జీవితం ఇప్పుడు మలుపులు తిరుగుతోంది. వైరల్ గర్ల్‌గా పేరు తెచ్చుకున్న మోనాలిసా ఇటీవల ఫర్మాన్ ఖాన్ అనే ముస్లిమ్ యువకుడిని ప్రేమ వివాహం చేసుకున్న సంగతి తెలిసిందే. అయితే ఈ పెళ్లి తర్వాత తమ ప్రాణాలకు ముప్పు పొంచి ఉందని.. కొంతమంది వ్యక్తులు తమను చంపేస్తామని బహిరంగంగా బెదిరిస్తున్నారని మోనాలిసా ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఈ మేరకు తనకు రక్షణ కల్పించాలని కోరుతూ అధికారులకు విజ్ఞప్తి చేసింది. వీరిద్దరి వివాహం వేర్వేరు మతాలకు సంబంధించింది కావడంతో సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. కొందరు దీనిని వివాదాస్పదం చేస్తూ విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ క్రమంలోనే తమకు వస్తున్న బెదిరింపులపై మోనాలిసా ఒక వీడియోను విడుదల చేసింది. మాకు ప్రాణహాని ఉంది.. దయచేసి మమ్మల్ని కాపాడండి అంటూ అధికారులను, మీడియాను వేడుకుంది. ఈ వీడియో ప్రస్తుతం నెట్టింట వైరల్‌గా మారింది. కేరళలోని ఒక ఆల యంలో ఈ నెల 11న వీరి వివాహం జరిగింది. ఈ పెళ్లికి కేరళ ప్రభుత్వం, అక్కడి మంత్రులు అందించిన మద్దతుపై మోనాలిసా దంపతులు కృతజ్ఞతలు తెలిపారు. తమ వివాహం ఇంత ఘనంగా జరుగుతుందని తాము ఊహించలేదని.. కేరళ విద్యాశాఖ మంత్రి స్వయంగా హాజరై ఆశీర్వదించడం సంతో షకరమని వారు పేర్కొన్నారు. అన్ని మతాలను తాను గౌరవి స్తానని.. ప్రేమకు మతం అడ్డుకాదని మోనాలిసా ఈ సం దర్భంగా స్పష్టం చేసింది.

మోనాలిసా–ఫర్మాన్ ఖాన్ ఒక సినిమా ప్రాజెక్ట్ పనిలో ఉ న్నప్పుడు పరిచయమయ్యారు. ఆ పరిచయం కాస్తా ప్రేమగా మారి పెళ్లికి దారి తీసింది. అయితే మతాలు వేరు కావడంతో మోనాలిసా కుటుంబ సభ్యులు ఈ సంబంధాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. ఇంట్లో అంగీకారం లభించకపోయినా.. మేజర్లయిన తమకు నచ్చిన భాగస్వామిని ఎంచుకునే హక్కు ఉందని భావించిన ఈ జంట కేరళ పోలీసు లను ఆశ్రయించి రక్షణ కోరింది. కుంభమేళాలో ఒక సామాన్య యువతిగా కనిపించి కోట్లాది మంది దృష్టిని ఆకర్షించిన మోనాలిసా ఇప్పుడు తన వ్యక్తిగత స్వేచ్ఛ కోసం పోరాడాల్సి రావడం చర్చనీయాంశమైంది. సామాజిక వర్గాల నుంచి వస్తున్న ఒత్తి ళ్లు, బెదిరింపుల నేపథ్యంలో ప్రభుత్వం తమకు పూర్తిస్థాయి భద్రత కల్పిస్తుందని ఈ జంట ఆశిస్తోంది. వ్యక్తిగత నిర్ణయాలను గౌరవించాల్సిన సమాజం ఇలాంటి బెదిరింపులకు దిగడంపై నెటిజన్లు భిన్నంగా స్పందిస్తున్నారు.

## కెమియో రోల్‌తో క్రేజ్ పెంచిన శృతి హాసన్.. ఫ్యాన్స్ ఫిదా



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ శృతి హాసన్ ఇప్పుడు సరికొత్త అవతారంలో మెరవబోతోంది. అనన్యా పాండే ప్రధాన పాత్రలో నటించిన పాపులర్ వెబ్ సిరీస్ 'కాల్ మీ బే' సీజన్ 2లో శృతి ఒక కీలక పాత్రలో భాగమైంది. రీసెంట్‌గా విడుద లైన టీజర్‌లో శృతి హాసన్ మెరవడంతో సోషల్ మీడియాలో ఒక్కసారిగా ఈ సిరీస్‌పై క్రేజ్ పెరిగిపోయింది. ఈ తెలుగ మ్మాయి బాలీవుడ్ వెబ్ వరల్డ్‌లోకి ఎంట్రీ ఇవ్వడం, అది కూడా ఒక క్రేజీ ప్రాజెక్టుతో కావడంతో ఫ్యాన్స్ ఖుషీ అవు తున్నారు. ఆ వివరాలు చూద్దాం..

శృతి హాసన్ కొత్త ప్రయాణం – 'నయీ బెహన్': ఒకప్పుడు స్టార్ హీరోల సరసన మెయిన్ లీడ్‌గా నటించిన శృతి హాసన్, ఇప్పుడు కథలో ప్రాధాన్యత ఉన్న వైవిధ్యమైన పాత్రలను ఎంచుకుంటోంది. 'కాల్ మీ బే' సెకండ్ సీజన్‌లో ఆమె "నయీ బెహన్" (కొత్త సోదరి) అనే ఇంట్రెస్టింగ్ క్యారెక్టర్‌లో కనిపిం చనుంది. ముంబై నేపథ్యంలో సాగే ఈ డ్రామాలో శృతి పాత్ర గ్లామర్‌తో పాటు కథలో కొంత ఉత్కంఠను కూడా పెంచుతుం దని సమాచారం. అనన్యా పాండే, శృతి హాసన్ కలిసి స్క్రీన్ షేర్ చేసుకోవడం ఈ సీజన్‌కు ప్రధాన ఆకర్షణగా నిలవ నుంది.

టీజర్‌లో మెరుపులు – ఫ్యాన్స్ రియాక్షన్: అమెజాన్ ప్రైమ్ వీడియో విడుదల చేసిన టీజర్‌లో శృతి హాసన్ కొన్ని షాట్లలో మాత్రమే కనిపించింది. దీంతో ఆమె అభిమానులు కొంచెం నిరుత్సాహం వ్యక్తం చేస్తున్నారు. టాలీవుడ్‌లో అంత పెద్ద స్టార్‌గా ఉన్న శృతికి కేవలం అతిథి పాత్ర లేదా చిన్న రోల్ ఇస్తే ఒప్పుకోమని నెటిజన్లు కామెంట్స్ చేస్తున్నారు. అయితే, టీజర్‌లో తక్కువగా కనిపించినా..సిరీస్ రిలీజ్ అయ్యాక ఆమె పాత్ర ప్రభావం బలంగా ఉంటుందని మేకర్స్ చెబుతున్నారు. శృతి తన స్టైలిష్ లుక్స్‌తో మరోసారి అందరినీ మాయ చేసేలా కనిపిస్తోంది.

మారుతున్న పాత్రల ఎంపిక: శృతి హాసన్ కెరీర్‌ను గమనిస్తే ఆమె ఇప్పుడు సెకండ్ లీడ్స్, క్యామియో రోల్స్ చేయడానికి కూడా వెనకాడటం లేదు. నటిగా తనను తాను నిరూపించుకోవడానికి పాత్ర టైం కంటే, ఆ పాత్రకు ఉన్న ప్రాముఖ్యతే ముఖ్యమని ఆమె భావిస్తున్నట్లు తెలుస్తోంది. గతంలో వచ్చిన కొన్ని సినిమాల్లో కూడా ఆమె ఇలాంటి ప్రయోగాలు చేసి సక్సెస్ అయింది. ఇప్పుడు బాలీవుడ్ డిజిటల్ స్పేస్‌లో తనదైన ముద్ర వేయడానికి ఈ సిరీస్ ఒక మంచి ప్లాట్‌ఫారమ్ అని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. సీజన్ 2పై భారీ అంచనాలు: మొదటి సీజన్ మంచి విజయాన్ని అందుకోవడంతో, రెండో సీజన్‌పై అంచనాలు భారీగా ఉన్నాయి.

ఇందులో కొత్తగా శృతి హాసన్ చేరడంతో క్యూరియాసిటీ మరింత పెరిగింది. ఇక ఈసారి బాంబే లైఫ్, రిలేషన్ షిప్స్ మరియు కెరీర్ చుట్టూ తిరిగే కథలో శృతి పాత్ర ఎలాంటి మలుపులు తిప్పుతుందో చూడాలి. ధర్మాటిక్ ఎంటర్టైన్మెంట్ నిర్మిస్తున్న ఈ సిరీస్ త్వరలోనే స్ట్రీమింగ్ కానుంది. అప్పటివరకు ఈ 'నయీ బెహన్' ఇచ్చే ట్విస్టుల కోసం ఫ్యాన్స్ వెయిట్ చేయాల్సిందే.

# ఘనంగా ఓం శక్తి ఆలయ కుంభాభిషేక మహోత్సవం






**రేణిగుంట, (రాజధాని వార్తలు):** రేణిగుంట మండలం ఎర్రం రెడ్డి పాలెంలో మూడు రోజులపాటు జరిగిన ఓం శక్తి ఆలయ కుంబాభిషేక మహోత్సవం ముగిసింది. అంకురార్పణం విశేష హోమాలు పూర్ణహుతి వంటి వైదిక క్రతువులతో ఆలయ ప్రాంగణం భక్తి పారవశ్యంతో మునిగిపోయింది. తూకివాకం గ్రామ సర్పంచ్ మునిశేఖర్ రెడ్డి ప్రత్యేక పర్యవేక్షణలో ఈ ఆలయ పునర్ని ర్మాణం అభివృద్ధి పనులు జరిగాయి. గతంలో ఓం శక్తి దర్శనం కోసం తమిళనాడు వెళ్లవలసి వచ్చేదని ఇప్పుడు స్థానికంగానే అద్భుతమైన ఆలయం నిర్మించడంపై సర్పంచ్ సంతోషం వ్యక్తం చేశారు. ఉత్సవాల ముగింపు సందర్భంగా నిర్వహించిన అన్నదానంలో సుమారు 1500 మంది భక్తులు పాల్గొని అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరించారు. వేడుకల విజయవంతం చేసిన మునిశేఖర్ రెడ్డికి గ్రామ పెద్దలు మరియు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

# బాబు వచ్చారు - జాబులు తెచ్చారు : డా.జి.దశరథాచారి, డా.యం.ఉమేష్ రావు

**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** బాబు వస్తేనే జాబు వస్తుందనే నమ్మకాన్ని నిజం చేస్తూ సిబియన్ ఎన్నో ఏళ్లుగా జాబ్ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువత రానికి కరెక్ట్ టైంలో జాబ్ క్యాలెండర్ ప్రకటించి రాష్ట్ర యువతరానికి ఊపిరిలూదారని, అందుకే ప్రస్తుతం యువతరం బాబు వచ్చారు – జాబులు తెచ్చారని సంబరాలు చేసుకుంటున్నారని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరథాచారి, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావులు కొనియాడారు. ఎన్నికలలో హామీ ఇచ్చినట్లుగానే అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఇరవై లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వ ఉద్యోగాలకు నోటిఫికేషన్లు ఇస్తున్నట్లు ప్రకటించిన సందర్భాన్ని పురస్కరించుకొని శుక్రవారం శ్రీకాళహస్తి పట్టణం, 18వ వార్డు పరిధిలోని, స్థానిక పూసల వీధిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏడాదికో జాబ్ క్యాలెండర్ అంటూ యువతకు ఇచ్చిన మాటను ఐదేళ్లు పక్కన పెట్టిన జగన్ రెడ్డికి విలువలు, విశ్వసనీయత గురించి మాట్లాడే అర్హత లేదని, యువగళంలో ఇచ్చిన మాటకు కట్టుబడి జాబ్ క్యాలెండర్ విడుదల చేసిన మంత్రి లోకేష్‌ను చూసి విశ్వసనీయత అంటే ఏంటో జగన్ రెడ్డి తెలుసుకోవాలని తెలిపారు. యువగళం పాదయాత్రలో నారా లోకేష్ ఇచ్చిన హామీ మేరకు ఉగాదిని పురస్కరించుకుని, 10,060 పోస్టులతో జాబ్ క్యాలెండర్ విడుదల చేసిందని గుర్తు చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర యువతరానికి గౌరవప్రథమైన ఉపాధి కల్పనే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 21 నెలల్లో ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో 6 లక్షల పైచిలుకు ఉద్యోగ, ఉపాధి కల్పన జరిగిందని కొనియాడారు. పెట్టుబడులు, పరిశ్రమల స్థాపనతో ఈ ఏడాది



ప్రైవేటు రంగంలో పెద్ద ఎత్తున ఉద్యోగ కల్పన జరగనుంది. ఇదే క్రమంలో శ్రీ పరాభవనామ సంవత్సర ఉగాది పండుగ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల్లో 10,060 ఉద్యోగాల భర్తీ చేయడానికి మే 15 నుంచి అక్టోబర్ 15 వరకు వీటికి సంబంధించిన నోటిపికేషన్లు ప్రభుత్వం రిలీజ్ చేయబోతున్నదని, ఇందుకు ఉద్యోగార్థులు సన్నద్ధతతో, ప్రతిభతో అవకాశాలను అందిపుచ్చుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డా.జి.దశరథాచారి, వన్నెకుల క్షత్రియ సంక్షేమం మరియు అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల్ రవి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గిరిజన సలహా మండలి సభ్యులు యం. సుబ్బయ్య, బిసి విభాగం రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డా.యం.ఉమేష్ రావు, తంగేళ్ళ పాలెం పిఏసియస్ ఛైర్మన్ బీమాల భాస్కర్, శ్రీకాళహస్తి పట్టణ కార్యనిర్వాహక కార్యదర్శి వజ్రం కిషోర్, నాయీ బ్రాహ్మణ సాధికార సమితి తిరుపతి పార్లమెంటు సోషల్ మీడియా కన్వీనర్ కోట చంద్రశేఖర్, తొట్టంబేడు మండలం, తెలుగు యువత అధ్యక్షుడు బీమాల చంద్రబాబు అనే చందు, శ్రీకాళహస్తి పురపాలక సంఘం, మాజీ కౌన్సిలర్ షేక్ మహబూబ్ బాషా, తిరుపతి పార్లమెంటు నాయకులు ఆనంద్ రెడ్డి, సయ్యద్ ముజీబ్, గాజుల భగత్, సులేమాన్, గంగనపల్లి రమేష్, సయ్యద్ ఆదిల్, వెంకటస్వామి, కృష్ణయ్య, సుబ్రహ్మణ్యం, మారయ్య, సలార్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి సేవా సంస్థ సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే సునీల్ కుమార్



**గూడూరు, (రాజధాని వార్తలు):** పేదలకు సేవ చేయడంలో ప్రగతి సేవా సంస్థ ఎప్పుడూ ముందుండి సేవా చేయడం ఎంతో అభినందనీయమని గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం ఫిరోజ్ చికెన్ అధినేత ఫిరోజ్ సహకారంతో 75 మంది నిరుపేద ముస్లిం కుటుంబాలకు 75 లైవ్ కోళ్ళు, మార్కెట్ సెల్వి (టమాటా హోల్ సేల్) సహకారంతో బిర్యానీ చేసుకోవడానికి అవసరమైన టమాటాలు, 2 గోంగూర కట్టలు, మసాలా దినుసులను ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో రంజాన్ తోఫాను ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే సునీల్ కుమార్ చేతుల మీదుగా అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రగతి సేవా సంస్థ కుల మతాలకతీతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించడంలో ముందుంటుందని ప్రతి సంవత్సరం రంజాన్ తోఫాలో తాను పాల్గొంటున్నానని తెలియజేశారు. అధ్యక్షులు కడివేటి చంద్రశేఖర్ మాట్లాడుతూ ప్రగతి సేవా సంస్థ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా రెండు రకాల రంజాన్ తోఫాలను అందజేస్తున్నామని అందులో భాగంగా పలసరుకులు, మంచి లైవ్ కోడలు మసాలా దినుసులను అందజేస్తున్నామని ఈ కార్యక్రమానికి సహాయ సహకారాలు అందించిన వారికి కృతజ్ఞతలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో మైనార్టీ నాయకులు, తిరుపతి పార్లమెంటు జిల్లా టిడిపి అధికార ప్రతినిధి అబ్దుల్ రహీం, ప్రగతి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు ఉపయోగిస్తున్న హోటల్స్‌పై దాడులు

**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం పట్టణంలో రెవెన్యూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తహశీల్దార్ నిహెచ్ వెంకట లక్ష్మి ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక హోటల్స్ నందు కమర్షియల్ గ్యాస్ సిలిండర్లు బదులు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు ఉపయోగిస్తున్న హోటల్‌పై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ తెలుపుతూ హోటల్స్ నిర్వాహకులు డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు ఉపయోగిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆమె హెచ్చరించారు. అలాగే పలు హొటల్స్‌లు తనిఖీలు నిర్వహించి, 6ఎ కేసు నమోదు చేసి డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందని ఆమె తెలిపారు.




ఈ తనిఖీలలో ఆమె వెంట ఎం.ఎస్.ఓ.భారతి, వీఆర్వోలు గంగాధర్, కిరణ్, రెవెన్యూ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

# రోడ్డు ప్రమాదంలో గాయపడిన జనసేన ఉద్యమి ఆవల రాజు

## - ఆర్థిక సహాయం కోసం ఎదురు చూపులు





**కందుకూరు, (రాజధాని వార్తలు):** ఉమ్మడి కూటమి ప్రభుత్వం నందు భాగస్వామి అయిన జనసేన పార్టీకి వాగర్తి ప్రాంతంలో యువ నాయకుడుగా, జనసేన ఉద్యమిగా పని చేస్తున్న ఆవల.రాజు (25) ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డాడు. దీనితో అతనికి మెరుగైన వైద్యం అందించాలని ఆయన కుటుంబ సభ్యులు నెల్లూరులోని ఒక ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స నిమిత్తం చేర్పించగా, నిరుపేద కుటుంబానికి చెందిన మత్స్యకార యువకుడైన రాజుకు వైద్యం కోసం అవసరమైన డబ్బులు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోందని ఆయన బంధువు ప్రళయకావేరి హరిబాబు శుక్రవారం స్తానిక విలేకరులకు తెలిపారు. వివరాలలోకి వెళితే...ఉలవపాడు మండలం పెద్ద పట్టపుపాలెం గ్రామానికి చెందిన ఆవల తిరుపతి కుమారుడు రాజు (25) అనే జనసేన ఉద్యమి కావలి నుండి పెద్ద పట్టపుపాలెం గ్రామానికి బైక్ మీద వస్తుండగా తెట్టు నుండి గుడ్లూరు వెళ్ళే రోడ్ దగ్గరలో బైక్ ఆక్సిడెంట్ జరిగింది. ఆవల రాజు గత ఏడాది జనసేన సభ్యత్వం తీసుకుని ఈ సంవత్సరం రెన్యువల్ కూడా చేయడమే కాకుండా జనసేన ఉద్యమిగా కూడా వ్యవహరిస్తూ, వాగర్తి ప్రాంతంలో జనసేన పార్టీ సభ్యత్వాలు చేయిస్తూ ఉన్నారు. సదరు రాజుకు అకస్మాత్తుగా ఈ ప్రమాదం జరగడంతో నిరుపేద కుటుంబానికి చెందిన ఆయన కుటుంబ సభ్యులు వైద్యానికి అవసరమైన డబ్బులు ఏర్పాటు చేయలేక దాతల సహకారం కోసం ఎదురు చూస్తున్నారని హరిబాబు తెలిపారు. ప్రస్తుతం నెల్లూరులో ఒక హాస్పిటల్‌లో ట్రీట్మెంట్ జరుగుతుంది. అయితే క్రిటికల్ కండిషన్‌లో ఉన్నాడనీ, జనసేన పార్టీ తరపున ఏమైనా సహాయం అందించగలిగే రాజు కుటుంబానికి ఆర్థికంగా చేయూత ఇవ్వడమే కాక, మారుమూల ప్రాంతాల్లో ఉన్న జనసేన పార్టీ కార్యకర్తలకు ఒక ప్రత్యేక భరోసా ఉంటుందని ప్రళయ కావేరి హరిబాబు స్వయంగా పేర్కొన్నారు. ఈ విషయంలో క్షతగాత్రుడు రాజుకు ఆర్థిక సహాయం చేయాలనుకునే దాతలు సెల్ నెంబర్: 8897276288 నందు తమను సంప్రదించాలని కోరారు. నెల్లూరులోని ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఉన్న ఆవల రాజుకు వైద్య సహాయం నిమిత్తం కందుకూరు నియోజక వర్గానికి చెందిన జనసేన పార్టీ సీనియర్ నేత దేవళ్ళ భాస్కర్‌రావు రూ. 10,000/-, గుడ్లూరు మండలానికి చెందిన శ్రీనివాసులు రూ.5,000/-, కందుకూరు నియోజక వర్గానికి చెందిన ఐ.టి. కో ఆర్డినేటర్ బింకం. నరేంద్ర రూ. 2,000/- అందించారని ఉలవపాడు మండలానికి చెందిన జనసైనికులు విలేకరులకు తెలిపారు.

# పోకూరు - రాళ్లపాడు రోడ్డు పనులకు శంకుస్థాపన చేసిన ఇంటూరి

## - రూ. 3 కోట్లతో జరగనున్న రోడ్డు నిర్మాణం పనులు





**కందుకూరు, (రాజధాని వార్తలు):** కందుకూరు నియోజక వర్గంలోని వలేటివారిపాలెం మండలం పోకూరు, శాఖవరం గ్రామాల మీదుగా లింగసముద్రం మండలంలోని వీరరాఘవుని కోట, తూనుగుంట, బ్రాహ్మణపల్లి, చీమలపెంట, తాతాహోటల్ మీదుగా రాళ్లపాడు రిజర్వాయర్ వరకు గల రోడ్డును అభివృద్ధి చేసే పనులకు కందుకూరు శాసనసభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు శుక్రవారం సాయంత్రం పోకూరులో శంకుస్థాపన చేశారు. రోడ్లు భవనాల శాఖ నుంచి ఎండిఆర్ గ్రాంట్ ద్వారా మంజూరైన 3 కోట్ల రూపాయలతో 18 కిలోమీటర్ల పొడవున రోడ్డును అభివృద్ధి చేయనున్నారు. ముందుగా పోకూరు గ్రామంలో ఎమ్మెల్యే నాగేశ్వర రావుకి అపూర్వ స్వాగతం లభించింది. టిడిపి నేతలు, కార్యకర్తలు, ప్రజలు పెద్దసంఖ్యలో తరలి వచ్చి ఎమ్మెల్యేపై పూల వర్షం కురిపిస్తూ మేళతాళాలతో శిలాఫలకం వద్దకు తీసుకెళ్లారు. శంకుస్థాపన అనంతరం ఎమ్మెల్యే ఇంటూరి అధికారులతో మాట్లాడుతూ పనులు నాణ్యతతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని సూచించారు. ప్రస్తుతం రోడ్డుకు రెండు వైపులా ఉన్న డ్రైనేజీ కాలువలకు సమానంగా కొత్త రోడ్డును నిర్మించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వేణుగోపాల్, జెఈ భరత్ రెడ్డి, ఎంపీడీవో శంకర్రావు, మండల టిడిపి అధ్యక్షులు మాదాల లక్ష్మీనరసింహం, గ్రామ పార్టీ అధ్యక్షుడు బత్తిన వెంకటేశ్వర్లు, నెల్లూరు పార్లమెంట్ ఉపాధ్యక్షుడు ఉన్నం వీరాస్వామి,సోమినేని తిరుమలరావు, ఘట్టమనేని లక్ష్మీనరసింహం, నల్లమోతు రవీంద్ర, గురజాల బెంజిమెన్, నాగభూషణం, ఘట్టమనేని సీతయ్య, అత్తోట వెంకటేశ్వర్లు, ఆలూరి రాములు, లాయర్ ప్రగడ శ్రీనివాసులు యాదవ్, చెరువుపల్లి సాంబయ్య, లింగ సముద్రం మండల మాజీ వైస్ ఎం.పి.పి వంకాయలపాటి మాల్యాద్రి, వి.ఆర్.కోట మాజీ సర్పంచ్ ముప్పరాజు లక్ష్మీ నరసింహం ఉన్నాం. వీరా స్వామిలతో పాటు లింగ సముద్రం, వలేటివారిపాలెం మండలాలలోని పలు గ్రామ పార్టీలకు చెందిన టీడీపీ అధ్యక్షులు, టీడీపీ అనుబంధ సంఘాల నేతలు, జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు తెలుగు మహిళలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# స్విమ్స్ కార్మికుల సమస్యలపై యాజమాన్యం మూగనాటకం

**తిరుపతి, (రాజధాని వార్తలు):** స్విమ్స్‌లో కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్ర వారంకి 22వ రోజుకు చేరుకున్నాయి. సమస్యలను పలుమార్లు తెలియజేసినా యాజమాన్యం స్పందించకపోవడంతో కార్మికులు నిరసన కొనసాగిస్తున్నారు. ఈ సందర్భంగా దీక్షా శిబిరంలో మాట్లా డిన సిఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షులు కందారపు మురళి, కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇంతకాలంగా దీక్షలు కొనసాగుతున్నా స్పందన లేకపోవడం సరైంది కాదన్నారు. కార్మికులు ఇప్పటికే రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, కార్మిక శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ, జిల్లా లేబర్ అధికారులకు సమ్మె నోటీసులు ఇచ్చినప్పటికీ ఇప్పటివరకు ఎటువంటి స్పష్టమైన చర్యలు తీసుకోలేదని తెలిపారు. చర్చల పేరుతో వాయి దాలు వేయడం వల్ల సమస్యలు మరింత ఆలస్యం అవుతున్నాయని చెప్పారు. సుమారు 800 మంది కార్మిక కుటుంబాలు ఈ సమస్యల వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని నాయకులు తెలిపారు. వెంటనే చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కార్మికులు కోరుతున్నారు. సిఐటీయూ పిలుపు మేరకు ఆదివారం జిల్లాలోని 36 మండలాలలో స్విమ్స్ కార్మికుల సమస్యల పరిష్కారం కోసం వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇదే సమయంలో నేడు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కుటుంబ సమేతంగా తిరుమలకు వస్తున్న నేపథ్యంలో అధికారులు ఇప్పటికైనా స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా సిఐటీయూ నాయకులు వేణుగోపాల్ మాట్లాడుతూ,యాజమాన్యం కాలయాపన చేసినా కార్మికుల పోరాటం ఆగదన్నారు. సమస్యలు పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు నిరాహార దీక్షలు కొనసాగుతాయని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సూరి, మారి ముత్తు, కోటయ్య, రాజా, బాలకృష్ణ, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.



# 25 లక్షల ఉద్యోగాలే లక్ష్యం యువతకు భరోసా

## - 20 నెలల్లో 6.5 లక్షల ఉద్యోగాలు.. ఉగాది వేళ జాబ్ క్యాలెండర్ ఒక వరం - ప్రైవేట్ రంగంలో 6,28,347 మందికి ఉపాధి...మరో 13,000 పైచిలుకు పోస్టులకు త్వరలో నోటిఫికేషన్‌లు

**అమలాపురం, (రాజధాని వార్తలు):** యువగళం పాదయాత్రలో నిరుద్యోగుల కష్టాలు చూశారు.. నేడు ఉద్యోగాల క్యాలెండర్ ఇచ్చారు 20 నెలల కాలంలో యువతకు ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో కూటమి ప్రభుత్వం ఉద్యోగ అవకాశాలు కల్పించిందని ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అన్నారు. అమలాపురం హౌసింగ్ బోర్డ్ కాలనీలోని పార్టీ క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే శుక్రవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. యువనేత లోకేష్ సంకల్పం రాష్ట్రం నిరుద్యోగ రహిత పాలన దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతుం దన్నారు. టీచర్ పోస్టుల భర్తీ అంటే కేరాఫ్ అడ్రస్ నారా చంద్రబాబుగా మారిందని ఎమ్మెల్యే అన్నారు. ఉగాది పర్వదినం సందర్భంగా రాష్ట్రంలో నిరుద్యోగ యువతకు అండగా నిలుస్తూ ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌లకు ఎమ్మెల్యే ఆనందరావు ధన్యవాదాలు తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన కేవలం 20 నెలల స్వల్ప కాలంలోనే మెగా డీఎస్సీ, పోలీస్ కానిస్టేబుల్, లెక్చరర్, అంగన్వాడీ పోస్టుల వంటి వివిధ నోటిఫికేషన్ల ద్వారా సుమారు



30,607 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడం జరిగిందని ఎమ్మెల్యే వివరించారు. కేవలం ప్రభుత్వ రంగమే కాకుండా, ప్రైవేటు రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకువస్తూ సుమారు 6,28,347 ఉద్యోగాలను నిరుద్యోగ యువతకు అందించడం గర్వకారణమని ఆయన పేర్కొన్నారు. ఇందులో భాగంగా ఎంఎస్ఎంఈల ద్వారా 2,48,906 మందికి, జాబ్ ఫెయిర్లు, స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణల ద్వారా 1,46,627 మందికి ఉపాధి లభించిందని తెలిపారు. అలాగే పారిశ్రామిక రంగంలో 95,174, ఫుడ్ ప్రాసెసింగ్‌లో 64,035, ఐటీ మరియు ఎలక్ట్రానిక్స్ రంగంలో 13,866 తో పాటు పర్యాటక రంగంలో 5,028 ఉద్యోగాలను ప్రభుత్వం కల్పించిందని వివరించారు. భవిష్యత్తు ప్రణాళికల గురించి మాట్లాడుతూ రాబోయే రోజుల్లో సుమారు 23 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించడం ద్వారా 21 లక్షల ఉద్యోగాలను కల్పించే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని ఆనందరావు తెలిపారు. చదువుకున్న ప్రతి యువకుడికి వారి అర్హతకు తగ్గట్టుగా ప్రభుత్వ లేదా ప్రైవేటు ఉద్యోగం వచ్చేలా ముఖ్యమంత్రి తీసుకుంటున్న చర్యలను నిరుద్యోగులందరూ గమనించాలని కోరారు. త్వరలోనే జాబ్ క్యాలెండర్ ప్రకారం గ్రూప్ 1, గ్రూప్ 2, మరో 3000 జూనియర్ లెక్చరర్ పోస్టులు, 1000 పోలీస్ ఉద్యోగాలు, కొత్త డీఎస్సీ, యూనివర్సిటీల్లోని 1500 ఖాళీలను భర్తీ చేసేందుకు నోటిఫికేషన్లు రాబోతున్నాయని ఆయన ప్రకటించారు. ఈ పరిపాలనా కాలంలో 25 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. గత వైసీపీ ప్రభుత్వంపై ఎమ్మెల్యే తీవ్ర విమర్శలు చేశారు. జగన్మోహన్ రెడ్డి తన ఐదేళ్ల పాలనలో జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను వంచించారని కనీసం ఒక్క డీఎస్సీ కూడా వేయకుండా విద్యా వ్యవస్థను నిర్వీర్యం చేశారని మండిపడ్డారు. ఉపాధి లేక జగన్ పాలనలో రాష్ట్ర వ్యాప్తంగా 4,001 మంది నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకోవడం ఆ ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమని అన్నారు.కేవలం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడే రాష్ట్రంలో డీఎస్సీ నోటిఫికేషన్లు వస్తాయని, ప్రస్తుతం పని చేస్తున్న ఉపాధ్యాయులందరూ టీడీపీ హయాంలో నియమితులైన వారేనని గుర్తు చేశారు. రాష్ట్రాన్ని దేశంలోనే మొదటి స్థానంలో నిలపడానికి, మరిన్ని ఉద్యోగ అవకాశాలు పొందడానికి యువత కూటమి ప్రభుత్వానికి అండగా నిలవాలని ఆయన పిలుపునిచ్చారు.

టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు మాట్లాడుతూ వైసీపీ హయాంలో గ్రాడ్యుయేట్లలో 24 శాతం నిరుద్యోగంతో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే మొదటి స్థానంలో నిలిచిం దని పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే నివేదికలను గుర్తు చేశారు. ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకుంటూ నిరుద్యోగుల పట్ల బాధ్యతగా వ్యవహరిస్తోందని అన్నారు. ఈ సమావేశంలో అముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, నల్లా స్వామి, కర్రి రామస్వామి, మాడ మాధవి, బొర్రా వెంకటేశ్వరరావు కూటమి నేతలు పాల్గొన్నారు.

# నవ దుర్గాలయంలో చండీ హోమ పూజలు






**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట పట్నంలోని నవదుర్గ ఆలయంలో వసంత నవరాత్రుల సందర్భంగా తొమ్మిది రోజుల పాటు 27 నక్షత్రాలకు సంబంధించి చండీ హోమ శాంతి పూజలను శాస్త్రవేత్తంగా జరిపిస్తున్నట్టు ఆలయ కార్యనిర్వహణ అధికారిణి, దేవి పుత్రిక కనక విజయలక్ష్మి అన్నారు. వసంత నవరాత్రుల మహోత్సవంలో భాగంగా రెండో రోజు చండీ హోమ పూజల సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవరాత్రులు తొమ్మిది రోజులు పాటు నవదుర్గలకు శాంతి హోమాలతో పాటు చండీ హోమ పూజలను లోక కళ్యాణార్థం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వేద పండితులు, ఆసాధులు అళ్ళక్కి రాంబాబు నేతృత్వంలో ఈ చండీ హోమ పూజలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నవరాత్రి ఉత్సవాలు చివరి రోజు 28వ తేదీన నవదుర్గలకు శాంతి హోమాలు నిర్వహించి భక్తులకు భారీ అన్నదాన కార్యక్రమం ఆలయ వద్ద నిర్వహి స్తున్నట్టు ఆమె చెప్పారు.

ప్రతిరోజు ఉదయం సాయంత్రం రెండు పూటలా ఈ చండీ హోమ పూజలను నిర్వహిస్తున్నట్టు ఆలయ అధికారిణి కనక విజయలక్ష్మి చెప్పారు. ఈ పూజలో జిల్లా పరిధిలోని ప్రముఖులు పాల్గొన్నట్టు చెప్పారు. ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తరించాలని ఈ సందర్భంగా ఆలయ అధికారిని కనక విజయలక్ష్మి తెలిపారు.

# ప్రభుత్వ కార్యాలయాలకూ పన్ను చెల్లింపుల సూచనలు

## - 100 శాతం పన్ను వసూళ్లే లక్ష్యం : డీఎల్పీఓ అన్నామణి





**కరప, (రాజధాని వార్తలు):** కరప మండలంలో ప్రభుత్వ కార్యాలయాలైన తహసీల్దార్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లలో ఆస్తి పన్ను బకాయిలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఈ బకాయిల వసూళ్లపై శుక్రవారం కాకినాడ డీఎల్పీఓ అన్నామణి, గ్రామ కార్యదర్శి శివరామకృష్ణలు తహసీల్దార్ తుమ్మల దుర్గాప్రసాద్, సబ్‌ఇన్‌స్పెక్టర్ తోట సునీతలను కలిసి బిల్లులు చెల్లించాలని కోరారు. అనంతరం డీఎల్పీఓ కరప గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటి పన్నుల వసూళ్లపై సమీక్ష సమావేశం నిర్వహించి, గ్రామంలో పన్ను వసూళ్ల ప్రగతిని పరిశీలించారు. లక్ష్యాలకు అనుగుణంగా 100 శాతం పన్ను వసూళ్లు జరగాలని, పెండింగ్ బకాయిలపై ప్రత్యేక దృష్టి సారించాలని సిబ్బందికి ఆదేశించారు. తరువాత గ్రామంలో పర్యటిస్తూ ప్రజల వద్ద నుంచి పన్నులు వసూలు చేశారు.

పన్నుల వసూళ్ల వేగాన్ని మరింత పెంచడంతో పాటు ఆన్‌లైన్ చెల్లింపులపై ప్రజల్లో అవగాహన కల్పించాలని సూచించారు. 100 శాతం పన్ను వసూళ్లే లక్ష్యమని, అందరూ సహకరించాలని డీఎల్పీఓ అన్నామణి పేర్కొన్నారు.

# స్పెషల్ ఆఫీసర్ రత్నమణి బాధ్యతలు



**సామర్లకోట, (రాజధాని వార్తలు):** సామర్లకోట మున్సిపల్ ప్రత్యేక అధికారిగా కాకినాడ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ రత్నమణి శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఈనెల 17వ తేదీతో మున్సిపల్ కౌన్సిల్ గడువు ముగియడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆయా మున్సిపల్ కార్యాలయాలకు ప్రత్యేక అధికార్లను నియమించిన విషయం విదితమే. ఈ మేరకు ప్రత్యేక అధికారిగా బాధ్యతలు చేపట్టడానికి సామర్లకోట మున్సిపల్ ఆఫీస్‌కి చేరుకున్న రత్నమణికు మున్సిపల్ కమిషనర్ ఎ శ్రీవిద్య ఆధ్వర్యంలో అధి కారులు ప్రత్యేక స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మీడియాతో మాట్లాడుతూ సామర్లకోట మున్సిపల్ పరిస్థితులను పరిశీలించి, జిల్లా అధికారుల సహకారంతో సమస్యల పరిష్కా రానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్బంగా ఆమె సిబ్బందిని పరిచయం చేసుకుని పట్టణ పరిస్థితులపై తెలుసుకున్నారు.

# నేడు ఎపి.డబ్ల్యూ.జే.ఎఫ్ ప్రథమ మహాసభ విజయవతం చేయండి




**తిరుపతి, (రాజధాని వార్తలు):** ఎపి.డబ్ల్యూ.జే.ఎఫ్ ఆధ్వర్యంలో ఈనెల మార్చి 22వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు తిరుపతిలోని రాస్ బిల్డింగ్‌లో నిర్వహించనున్నారని అందరూ కలిసి జయప్రదం చేయాలని కోరారు. తిరుపతి జిల్లా ప్రథమ మహాసభల పోస్టర్‌ను ఆ సంఘం నాయకులు తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఉపాధ్యక్షులు వలిగులం గోపి మాట్లాడుతూ జర్నలిస్టుల సమస్యలపై పోరాడడానికి, జర్నలిస్టుల గళాన్ని ప్రభుత్వానికి తెలియజేయడానికి ఏర్పడ్డ సంస్థ ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ అని అన్నారు. పక్క రాష్ట్రాలలోలాగా జర్నలిస్టులకు పింఛన్ పథకాలను అమలు చేయాలని,వెటర్నర్ జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాని డిమాండ్ చేశామన్నారు. అలాగే జర్నలిస్టులకు ఇంటి స్థలాలలో మంజూరు చేయాలని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని తెలిపారు. ఈనెల 4వ తేదీన విజయవాడలో జరిగిన సమావేశంలో ఆ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు తెలిపారు. అలాగే జర్నలిస్టులకు సమస్యలపై పోరాటానికి ఈ సంఘం ముందుంటుం దని తెలిపారు. జరగనున్న మహాసభకు తిరుపతి జిల్లా జర్నలిస్టు మిత్రులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ తిరుపతి జిల్లా నాయకులు చంగల్రాయలు, గాంధీ, పానేటి చెంగల్రాయులు, శ్రీనివాసులు, తిరుపతి నియోజకవర్గం అధ్యక్షులు బాల సుబ్రమణ్యం, ప్రధాన కార్యదర్శి చామంచి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# జపాన్ పరిశోధనా కేంద్రానికి ఎంపికైన సత్య ప్రవీణ్

## - విద్యార్థి సత్య ప్రవీణ్‌ను అభినందించిన ఎమ్మెల్యే ఆనందరావు

**అమలాపురం, (రాజధాని వార్తలు):** అంతర్జాతీయ స్థాయిలో వైజ్ఞానిక రంగంలో ప్రతిభ కనబరిచి జపాన్‌లోని ప్రతిష్టాత్మక "సకురా" పరిశోధనా కేంద్రాన్ని సందర్శించే అరుదైన అవకాశం దక్కించుకున్న అమలాపురం మహాత్మాగాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థి నక్కా సత్య ప్రవీణ్‌ను అమలాపురం శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు అభినందించారు. అమలాపురం హౌసింగ్ బోర్డు కాలనీలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం విద్యార్థి సత్య ప్రవీణ్, తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం ఎమ్మెల్యే ఆనందరావును కలిసి సత్య ప్రవీణ్‌కు దక్కిన అవకాశాన్ని వివరించారు. ఎమ్మెల్యే విద్యార్థి ప్రవీణ్ ను శాలువాతో సత్కరించి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. దేశవ్యాప్తంగా ఎంపికైన 120 మందిలో మన అమలాపురం విద్యార్థి ఉండటం, జాతీయ స్థాయిలో టాప్-60లో నిలవడం మన జిల్లా విద్యా వ్యవస్థకే గర్వకారణమన్నారు. ఒక ప్రభుత్వ పాఠశాల విద్యార్థి అంతర్జాతీయ స్థాయికి ఎదగడం హర్షించదగ్గ విషయమని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు



నాయుడు విజన్, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ కృషి వల్ల మన పాఠశాలలు కార్పొరేట్ స్థాయికి దీటుగా ఎదుగుతు న్నాయని అన్నారు. ప్రవీణ్‌ను తీర్చిదిద్దిన సైన్స్ ఉపాధ్యాయులను, ప్రధానోపాధ్యాయులు ఘన సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖ అధికారులను ఎమ్మెల్యే అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.ఎన్. వెంకటేశ్వర, రాయుడు శ్రీనివాసరావు, కె.ఆర్.ఎన్. ప్రసాద్, ఎం.చంద్ర మోహన్, మట్టపర్తి శ్రీనివాసరావు కూటమి నాయకులు పాల్గొన్నారు.

# పట్టణాలు, పల్లెలు పూర్తి అభివృద్ధి



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం పట్టణంలోని ప్రసన్న ఆంజనేయ కాలనీలో కొత్తగా నిర్మించిన సిసి రోడ్డును పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ జిల్లా తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు నిమ్మకాయల రంగనాగ్, జనసేన జిల్లా అద్యక్షులు, డిసిసిబి చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు) లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణాలు, గ్రామాల్లో ఉన్న అన్ని సమస్యలను పరిష్కరించేందుకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యత నిస్తుందన్నారు. ఇప్పటికే సీసీ రోడ్లు దాదాపుగా పూర్తి చెయ్యగా డ్రెయిన్‌లు, కమ్యూనిటీ హాలులు వంటి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. ఇంకా పిల్లలు, పెద్దల వ్యాయామానికి గానూ పార్కుల నిర్మాణాలు వేగవంతంగా పూర్తి చేస్తున్నట్టు చెప్పారు. ప్రజలకు ఇంకా అవసరాలుంటే వాటిని తమ దృష్టికి తీసుకు వస్తే వాటిని పరిష్కరించునున్నట్టు ఎమ్మెల్యే చెప్పారు. ఈ సందర్బంగా శిలాఫలకం ఆవిష్కరించి, రిబ్బను కత్తిరించి వారు రహదారిని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెద్దాపురం మున్సిపల్ మాజీ చైర్మన్ రాజా సూరిబాబు రాజు, మున్సిపల్ కమిషనర్ శ్రీధర్ రెడ్డి, కూటమి కూటమి నాయకులు పాల్గొన్నారు.

# RAJADHANI CLASSIFIEDS Ad. Call 9440662699, rajadhanivartalu.com

## EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్సిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

## HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

## MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

## REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

## NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ టి.రమేష్, మంగళగిరి 0863-999999

## RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

## COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎప్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్సు కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పొట్లాబత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్సపోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# నిరుద్యోగుల జీవితాల్లో వెలుగు జాబ్ క్యాలెండర్



ఆడిన మాట తప్పుగూడదు -అంటే దాన్ని తుచ- తప్పక పాటించడం. వాగ్దానం ఎప్పుడు మరువకూడదు. తానూ అన్న మాటకు కట్టుబడి సత్యంతో, బ్రతకడం, అభిమాన ధనులైన వారికి ఉత్తమ మార్గం. ఆ మార్గంలోనే నడుస్తున్నారు ఐ.టీ శాఖమంత్రి నారా లోకేష్. మాట మీద నిలబడే వారికి ఇంట బయట గౌరవ మర్యాదలుంటాయి. అందుకే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు కూటమి ప్రభుత్వానికి బ్రహ్మరథం పడుతున్నారు. జాబ్ క్యాలెండర్ విషయంలో ఇచ్చిన హామీని అమలు చేయడంక కూటమి ప్రభుత్వానికే సాధ్యమని మరో సారి నారా లోకేష్ రుజువు చేశారు. ఆడిన మాట తప్పినా వారికి ఏ ఉన్నత స్థానంలో వున్నా గౌరవం వుండదు సరికదా వారి నెవరు నమ్మరు. సొంత మనుషులు కూడా వారిని చులకనగా చూస్తారు.సమాజం వారిని వెలి వేస్తుందనడానికి గత వైసీపీ సర్కారే తార్కాణం. గడిచిన అయిదేళ్ళలో ఒక్క ప్రభుత్వ ఉద్యోగాన్ని కూడ భర్తీ చేయకుండా వంచించినజగన్ రెడ్డి ప్రభుత్వానికి నిరుద్యోగులు కర్రు కాల్చి వాతపెట్టారు. తెలుగు నూతన సంవత్సరాది ఉగాదిని పురస్కరించుకుని కూటమి ప్రభుత్వం మరో ఎన్నికల హామీని నెరవేర్చింది. ఈ ఏడాది అంటే 2026 కు సంబంధించిన జాబ్ క్యాలెండర్ ను విడుదల చేసింది. ఇప్పటికే కూటమి ప్రభుత్వ ఏర్పాటు తర్వాత మెగా డిఎస్సి నిర్వహించింది... ఇందులో 16 వేలకు పైగా టీచర్ పోస్టులను భర్తీ చేశారు. ఈ సమయంలోనే ఉద్యోగాలు రాని యువతీ యువకులకు ప్రభుత్వం భరోసా ఇచ్చింది. త్వరలోనే మరో డిఎస్సి నిర్వహిస్తామని... ప్రిపరేషన్ కొనసాగించాలని సూచించింది. చెప్పినట్లుగానే కేవలం విద్యా శాఖలోనే నాలుగు వేలకుపైగా ఉద్యోగాలను భర్తీ చేసేందుకు సిద్దమయ్యింది.ఇక పోలీస్ శాఖలో కూడా గతేడాది భారీగానే ఉద్యోగాల భర్తీ జరిగింది. కేవలం ఇంటర్మీడియట్ అర్హతతోనే 6000 పైగా కానిస్టేబుల్ ఉద్యోగాల భర్తీని పూర్తిచేసింది.. ఇప్పుడు మరోసారి హోంశాఖలో ఉద్యోగాల భర్తీకి సిద్దమయ్యింది. హోంశాఖలో 2778 పోస్టులను భర్తీ చేయనున్నట్లు జాబ్ క్యాలెండర్లో పేర్కొన్నారు.. ఇందులో కానిస్టేబుల్ తో పాటు ఎస్సై ఉద్యోగాలు కూడా ఉండే అవకాశాలున్నాయి. కాబట్టి పోలీస్ ఉద్యోగాలకు సన్నద్దమయ్యే యువత పట్టుదలతో శ్రమిస్తే ఉద్యోగం సాధించడం ఖాయం. నిరుద్యోగుల కల సాకారం కాబోతోందనడానికి జాబ్ క్యాలెండర్ నిదర్శనమని చెప్పాలి. 20 నెలల కాలంలో 30,607 ప్రభుత్వ ఉద్యోగాలు కూటమి ప్రభుత్వం ఇచ్చింది. ఉపాధ్యాయ, కానిస్టేబుల్ పోస్టులకి ఎంపికైన వారికి నియామక పత్రాలు అందించినప్పుడు యువత కళ్లలో ఆనందం వర్ణించలేం. ఈ ఏడాది ఇచ్చే నోటిఫికేషన్ల ద్వారా 10,060 ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేయబోతున్నారంటే నిరుద్యోగ యువత కూటమి ప్రభుత్వంపై పెట్టుకున్న ఆశలను మంత్రి నారా లోకేష్ నెరవేరుస్తున్నారు. యువగళం పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు, పారదర్శకమైన రీతిలో మొత్తం 10,060 ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి కూటమి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. భరోసానిస్తున్న లోకేష్ విజన్ నిరుద్యోగుల సమస్యలను నేరుగా వింటూ, వారి అర్హతలకు తగ్గట్టుగా అవకాశాలు కల్పించడంలో నారా లోకేష్ ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. గత ప్రభుత్వం హయాంలో నిలిచిపోయిన ఫీజు రీయింబర్స్మెంట్ నిధులను విడుదల చేయడమే కాకుండా, ఇప్పుడు భారీ స్థాయిలో ఉద్యోగ ప్రకటనలు చేయడం ఆయన చిత్తశుద్ధికి నిదర్శనమనే చెప్పడంలో సందేహమే లేదు. ఒకవైపు ఐటీ హబ్‌ల ఏర్పాటు, మరోవైపు ప్రభుత్వ కొలువుల జాతరతో ఏపీ యువతకు లోకేష్ ఒక నిజమైన ఆశాకిరణంగా మారుతున్నారు. జాబ్ ఫస్ట్ అనేది కూటమి ప్రభుత్వం విధానమనేది జాబ్ క్యాలెండర్ ద్వారా స్పష్టమవుతున్నది. కూటమి ప్రభుత్వ 21 నెలల పాలనలో ప్రభుత్వ,ప్రైవేట్ రంగాల్లో 6 లక్షల పైచిలుకు ఉద్యోగ ఉపాధి కల్పన జరిగిదంటే అది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కృషి, మంత్రి నారా లోకేష్ పట్టుదలవల్లే సాధ్యమైంది. లోకేష్‌కు జగన్ మధ్య ఎంతో వ్యత్యాసం ఇచ్చిన మాటకు కట్టుబడే తత్వం నారా లోకేష్ దైతే అందరిని వంచించే నైజం వైఎస్ జగన్ రెడ్డిది. ఈ ఇరువురిని గమనిస్తే "నక్కకి నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది. యువగళంలో తాను ఇచ్చిన హామీలన్నింటిని నెరవేర్చేందుకు మంత్రి నారా లోకేష్ కంకణబద్దులై పని చేస్తున్నారు. అయితే 2019 ఎన్నికల సమయంలో వైఎస్ జగన్ రెడ్డి ఇచ్చిన హామీలన్నింటిని అధికారంలోకి వచ్చిన మరుక్షణం తుంగలోకి తొక్కారు.ఉద్యోగాల విప్లవం తీసుకు వస్తామంటూ ప్రతిపక్షంలో ఉండగా ఇచ్చిన హామీని అధికార పగ్గాలు చేపట్టాక గాలికొదిలేశారు. నిరుద్యోగుల చెవిలో పువ్వులు పెట్టారు. అప్పట్లో రాష్ట్రంలో ఉన్న 2,30,000 ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేస్తామని నిరుద్యోగుల్లో ఆశలు రేకెత్తించారు. తీరా అధికారంలోకి వచ్చాక ఆ ఊసే మరచిపోయారు. ఏటా జనవరి 1న జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామన్నారు. అధికారంలో ఉన్న అయిదేళ్ళు ఈ విషయాన్ని పక్కకు పెట్టిన ఘనత జగన్ రెడ్డిదే. అయితే ప్రతిపక్ష నేతగా నారా లోకేష్ నిర్వహించిన యువగళం పాద యాత్ర సందర్భంగా ప్రతి ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తామని నిరుద్యోగులకు హామీ ఇచ్చారు. ఆ హామీని నిలబెట్టుకున్న ప్రజా ప్రభుత్వం అంటే చంద్రబాబు నాయుడి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వమనే చెప్పాలి. జాబ్ క్యాలెండర్ విడుదల చేసి ఇచ్చిన మాటకు కట్టుబడిన నిరుద్యోగుల ఆశాకిరణం నారాలోకేష్ హ్యాట్సాఫ్ !

**వాసంశెట్టి సుభాష్**
కార్మిక శాఖ మంత్రి, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం

# దక్షిణంలో 95 శాతం డిజిటలైజేషన్ ప్రక్రియ

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** పార్టీ ఆదేశాల మేరకు నియోజకవర్గంలో చేపట్టిన డిజిటలైజేషన్ ప్రక్రియ వేగవంతంగా కొనసాగుతుందని వైసిపి విశాఖ దక్షిణ నియోజకవర్గం సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ తెలిపారు. 37వ వార్డులో చేపట్టిన డిజిటలైజేషన్ ప్రక్రియను ఆయన పరిశీలించారు.ఇక్కడ 85 శాతం ఈ ప్రక్రియ పూర్తి కావడంతో స్థానిక నాయకులను ఆయన అభినందించారు.త్వరితగతిన ఈ ప్రక్రియ పూర్తి చేయాలని ఆయన కోరారు. దక్షిణ నియోజకవర్గంలో ఇప్పటికే 95.శాతం పూర్తయింది అన్నారు. మరికొద్ది రోజులలో 100 శాతం పూర్తి కాబోతుందని చెప్పారు. క్యాడర్ రిజిస్ట్రేషన్‌ను ఆన్లైన్లో పొందుపరిచే ప్రక్రియ మరింత వేగం పుంజుకుందని తెలిపారు. నియోజకవర్గంలో అన్ని వార్డులలో వాటర్ కార్డులో విధిగా వివరాలు మార్పులు చేర్పుల కోసం దరఖాస్తు చేసుకునేలా బూత్ కమిటీ నాయకులు శ్రద్ధ వహించాలని అన్నారు. రానున్న జీవీఎంసీ ఎన్నికలలో వైసీపీ అఖండ విజయం సాధించేదిగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. ప్రజలలో ప్రభుత్వం పట్ల వ్యతిరేకత ఉందన్నారు.పార్టీ అధినేత వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో ప్రజా సమస్యలపై ప్రజల తరపున పోరాటం చేయాలన్నారు.ఎన్నికల ముందు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూటమి ప్రభుత్వం సక్రమంగా అమలు చేయలేదని చెప్పారు. ప్రభుత్వ విధానాలను నిలదీసే వారిపై అక్రమ కేసులు బయిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం చేసే తప్పులను ప్రశ్నించే వారిని అక్రమ అరెస్టులతో భయ పెడుతున్నారని మండిపడ్డారు. జగన్మోహన్ రెడ్డి మళ్ళీ అధికారంలోకి రావడం తప్పదని అన్నారు. ఆయన ముఖ్యమంత్రిగా పదవి బాధ్యతలు చేపట్టడం ఖాయమని స్పష్టం చేశారు. వైసిపితోనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ రేయి డేవిడ్ రాజు, జిల్లా జనరల్ సెక్రటరీ గణగళ్ల రామరాజు, జిల్లా బీసీ సెల్ జనరల్ సెక్రటరీ చోడిపల్లి శివ కుమార్, సౌత్ వై.ఎస్.ఆర్.టి.ఎఫ్ ప్రెసిడెంట్ సారిక దైవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan